VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు ఒక అణా. రిజిష్టర్డు నెం. A 193

రిపబ్లిక్ అయినా పాకిస్తాన్ కామన్వెల్తులోనే వుంటుందట

కరాచీ, జనవరి 17

పాకిస్తాన్ నూతన రాజ్యాంగం క్రింద రిపబ్లిక్ అయినప్పటికీ ఇండియాతల కామన్వెల్తులోనే వుంచ నిశ్చయించినదని, అధికార వర్గాలవారు నేడు తెలియపరిచారు.

విశాలాంధ్ర

సంపుటి 4 ★ విజయవాడ: గురువారం జనవరి 19; 1956 ★ సంచిక 300

మోటార్ ట్రక్కు ప్రమాదంలో ఏడుగురి మరణం

ఇంఫాల్, జనవరి 17

ఇక్కడికి 250 మైళ్ళ ఉత్తరంగా వెళ్ళుచు, పోయిలతుమ్ప అనే మోటారుట్రక్కు బోల్తా కొట్టడంవల్ల అక్కడికక్కడే ఏడుగురు మరణించారు. ఐదుగురికి గాయాలు తగిలాయి.

విశాలాంధ్రనువ్యతిరేకించేప్రతీపశక్తులకుట్రల్ని భగ్నంచేయండి

తెలుగు ప్రజలకూ, ప్రజాసంస్థలకూ ఆంధ్ర కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి విజ్ఞప్తి

తక్షణమే సభలు, సమావేశాలు, ఊరేగింపులు, టెలిగ్రాముల ద్వారా ఐక్యాందోళన జరపాలని విన్నపం

విజయవాడ, జనవరి 18

ఢిల్లీనుంచి చేరుతున్న వార్తలనుబట్టి ముక్కోటి తెలుగుప్రజల జాతీయవాంఛ విశాలాంధ్రకు ఎగనామం పెట్టేందుకు ప్రతీపశక్తులు తీవ్రంగా కృషిచేస్తున్నట్లుగా తెలుస్తోందనీ, ఆఖరి నిమిషంలో జరుగుతున్న ఈ కుట్రను భగ్నం చేయడానికి ఆంధ్ర ప్రజానీకం పూనుకోవాలనీ, తెలుగు దేశమంతటా సభలు, పూరేగింపులూ జరుపాలనీ, తక్షణ విశాలాంధ్ర నిర్మాణాన్ని కోరుతూ అధిష్టానవర్గానికి టెలిగ్రాములు పంపాలనీ ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారిలా ప్రకటించుతున్నారు.

ఆయన ప్రకటనలో యిలావుంది:

కాంగ్రెసు వర్కింగ్ కమిటీ విశాలాంధ్ర తక్షణ నిర్మాణం తమ అభిమతమని తీర్మానించడంవల్లనూ, భారత పార్లమెంటులో ప్రధాని నెహ్రూ, హోంమంత్రి శ్రీ గోవిందవల్లభపంత్ గార్లు ఆంధ్ర - తెలంగాణాల విలీనీకరణకు తమ సుముఖత వెల్లడించుటవల్లనూ తెలుగు ప్రజలంతా తమ జాతీయవాంఛ నెరవేరే శుభసమయం ఆసన్నమయిందని సంతోషించుతూ వచ్చారు. కేంద్రప్రభుత్వ మంత్రులు, కాంగ్రెసు అధిష్టానవర్గం తాము చేసిన వాగ్దానాలకు కట్టుబడి వుంటారని ఆశించుతూ వచ్చారు.

కాని యిప్పుడే రాత్రి 12 గంటలకు చేరిన వార్తలనుబట్టి కొందరు అభివృద్ధి నిరోధకులు తెలుగు ప్రజల వాంఛను తృణీకరించేలా చేసేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తూంది. భాషాప్రభుత్వం రాష్ట్రాల పునర్నిర్మాణంపై చేసిన ప్రకటనలో విశాలాంధ్ర ప్రసక్తి లేకపోవడానికీ, ఎన్నడో సుముఖత ప్రకటించిన విషయంపై దీర్ఘచర్చలతో కాలయాపన చేయడానికీ అదే కారణమని కూడా ఎంచబడుతూంది.

సిద్ధాన్నాన్ని మట్టిలో పోసేందుకు ఆఖరి నిమిషంలో జరుగుతున్న కుట్రలను ఓడించడానికి ఆంధ్రప్రజానీకమంతా వెంటనే పూనుకోవాలి. లేనిచో మన జాతీయవాంఛ నెరవేరకుండా పోయే ప్రమాదముంది.

అందుచేత తక్షణ విశాలాంధ్ర నిర్మాణాన్ని కోరుతూ ముక్కోటి తెలుగు ప్రజలు తీవ్రాందోళన చేయాలసిన అవసరం మెచ్చింది. కొలది రోజుల్లోనే అంతిమ నిర్ణయం జరుగబోతూంది గాన, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంస్థలు ఐక్యంగా వెంటనే యిందుకు పూనుకోవాలి.

తెలుగు దేశమంతటా గ్రామగ్రామాన, ప్రతిపట్టణంలోనూ ఊరేగింపులు, సభలు జరిపి, ముక్కోటి తెలుగు ప్రజలవాంఛను దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనింప చేయాలి. ఉపసంఘ సభ్యులైన ప్రధాని నెహ్రూ, ఆజాద్, ధేబర్, పంత్ గార్లకు తక్షణ విశాలాంధ్ర నిర్మాణాన్ని కోరుతూ టెలిగ్రాములు పంపాలి. తెలుగు జాతిని చీల్చడానికి చేసే కుట్రలను తెలుగు ప్రజలు సహించరనీ, తమ జాతీయ వాంఛను చేయడానికి సిద్ధంగా వున్నారనీ ఎలుగెత్తి చాటాలి. జై విశాలాంధ్ర!

చైనానుంచి సుహృద్భావ ప్రతినిధుల రాక

న్యూఢిల్లీ, జనవరి 17

చైనా - భారత మిత్రసంఘపు తరఫున 11 మందితోకూడిన సుహృద్భావ రాయబారవర్గం నేడు పెకింగ్ నుండి కలకత్తా మీదుగా ఢిల్లీ వచ్చారు.

విశాలాంధ్ర నిర్మాణం అనుమానాస్పదమయినందుకు ఆంధ్రుల ఆందోళన

ఆంధ్రావని అగ్నిపర్వతంవలె వుడికి పోతున్నదని శ్రీ కాళేశ్వరరావుగారి ప్రకటన

నెహ్రూ ప్రభృతులకు విజయవాడనుండి టెలిగ్రాముల పరంపర

విజయవాడ, జనవరి 18

విశాలాంధ్ర నిర్మాణం అనుమానంలో పడిందని తెలిసి విజయవాడ ప్రజలంతా అట్టుడికినట్లు ఉడికిపోతున్నారు. తక్షణమే విశాలాంధ్ర నేర్పాటు చేయాలని కోరుతూ పట్టణంలోని రాజకీయపక్షాలవారూ, ప్రజాసంఘాలవారూ, డాక్టర్లు, లాయర్లు, వర్తకసంఘాలవారూ నెహ్రూ, పంత్, ధేబర్, అజాద్ గార్లకు తంతులు పంపారు.

విజయవాడలో సంపూర్ణ హర్తాలు జరపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆంధ్రశాసనసభా కాంగ్రెస్ పార్టీ ఉపనాయకులు, విశాలాంధ్ర మహాసభ అధ్యక్షులైన శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు కాంగ్రెసు కార్యవర్గ ఉపసంఘ సభ్యులందరికీ నేటి ఉదయం తంతిపంపుతూ విశాలాంధ్ర నిర్మాణానికి అనుకూలంగా యింతవరకు ప్రకటన చేయక పోవటంవలన ఆంధ్రావని అంతా అగ్ని పర్వతంవలె ఉడికిపోతున్నదని తెలియజేసారు. విశాలాంధ్ర నిర్మాణంలో జరుగుతున్న విలంబన ఆంధ్ర ప్రజకు తీవ్రమైన మానసికాందోళనను కలిగించు తున్నదన్నారు. సంయుక్త మహారాష్ట్ర, గుజరాత్, ఐక్య కర్ణాటక రాష్ట్రాల వలెనే సత్వరమే విశాలాంధ్ర రాష్ట్రాన్నివ్వాలని కోరారు.

"తక్షణమే విశాలాంధ్ర నేర్పడాలని ఆంధ్రప్రజలు కోరుతున్నారు. అలా ఇవ్వకపోతే ఆంధ్రలో తీవ్రమైన అశాంతి చెలరేగుతుందని" విజయవాడ వాణిజ్య పరిశ్రమల మండలివారు ప్రధాని నెహ్రూకు, యితర ఉపసంఘ సభ్యులకు పంపిన తంతిలో హెచ్చరించారు. విజయవాడ క్రేవర్స్ అసోసియేషన్, విజయవాడ చిల్లర పట్టుల వర్తకుల సంఘం, టోకు బట్టల వర్తక సంఘం, వెండి, బంగారు వర్తకుల సంఘం, ఆంధ్రదేశ ఇన్సూరెన్సు ఏజెంట్ల సంఘం, ఆంధ్ర రాష్ట్ర మోటారు డీలర్స్ అసోసియేషన్, ఆంధ్రరాష్ట్ర మోటార్ యూనియన్ కాంగ్రెస్‌వారు, సెషనరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ చిట్టూరి రామకృష్ణయ్యగారు తక్షణమే విశాలాంధ్రను నిర్మిం

(మిగతా 2వ పేజీలో)

విశాలాంధ్రపై ఢిల్లీనుంచి ఆందోళనకర వార్తలు

(విశాలాంధ్ర విలేఖరి)

న్యూఢిల్లీ, జనవరి 17

రాష్ట్రాల పునర్విభజనను గురించి సిఫార్సు చేయడం కోసం కాంగ్రెసు కార్యవర్గం నియమించిన ఉపసంఘ సభ్యులు సలుగురూ ఇవ్వాళ, ఇక్కడ సమావేశమై విశాలాంధ్ర సమస్యను గురించి 90 నిముషాలపాటు చర్చలు జరిపారు. ఈ చర్చల ధోరణినిబట్టి విశాలాంధ్ర సమస్య చాల ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెసు అధిష్టానవర్గం విశాలాంధ్ర నిర్మాణానికి సుముఖంగా ఉన్నట్టు ఇప్పటివరకూ వార్తలు వస్తున్నా, తుదినిర్ణయంతీసుకోబోయే సమయంలో మౌలానాఆజాద్ మొండిగా అడ్డుతగులుతున్నట్టూ, అందుచేత తెలుగు-తెంపూలేని జచ్చలు జరుగుతున్నట్టూ విశ్వసనీయ వర్గాలద్వారా వినవస్తోంది.

రేపు, ఎల్లుండి కూడ విశాలాంధ్ర విషయమై ఉపసంఘం చర్చలుసాగించవచ్చునంటున్నారు.

విశాలాంధ్ర ఏర్పరిస్తే ముస్లిం సైనాకీలకు "ముప్పు"కలుగుతుందని మౌలానా ఆజాద్ పిడివాదం చేస్తున్నారట. ప్రత్యేక తెలంగాణావాదుల పక్షం వహించిన మౌలానా ఆజాద్ ఏదో ఒక సాకుతో విశాలాంధ్ర నిర్మాణాన్ని తీవ్రంగా ఎదిరిస్తుండటం వల్ల తుదినిర్ణయంపైన ఇక్కడి విశాలాంధ్ర అనుకూల వర్గాలు చాల ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

పిలవని పేరంటంగా హైద్రాబాదు వెళ్లి వచ్చిన శ్రీ యస్. కె. పాటిల్ "విశాలాంధ్ర నిర్మాణం సుతరాం పనికిరా"దంటూ కాంగ్రెస్ అధిష్టానవర్గానికిచ్చిన నివేదిక కూడా అగ్నిలో ఆజ్యం పోసినట్లయిందని ఇక్కడ భావించబడుతోంది.

ఆంధ్రదేశంలోని రాజకీయపక్షాలు ప్రజాసంస్థలు, ప్రజలు, శాసనసభా ఏకకంఠంతో విశాలాంధ్రను వాంఛిస్తున్నా, 70 మంది తెలంగాణా శాసన సభ్యులూ, తెలంగాణా ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులూ విశాలాంధ్ర నిర్మాణానికి సుముఖంగావున్నా, పార్లమెంటులోని ఆంధ్ర సభ్యుల్లో అధిక సంఖ్యాకులు తక్షణం విశాలాంధ్ర ఏర్పడాలని డిమాండు చేస్తున్నా - తెలుగు ప్రజలు విశాలాంధ్ర నిర్మాణాన్ని వాంఛిస్తున్నట్లు హోంమంత్రి శ్రీ పంత్ పార్లమెంటులో విస్పష్టంగా వెల్లడించినా, ఉపసంఘం ఇంతగా తటపటాయించడం రాజకీయ వర్గాల్లో చాల కలవరం కలిగిస్తోంది.

హైద్రాబాదు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణరావు, ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం అధ్యక్షులు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు గార్లు కాంగ్రెసు అధిష్టానవర్గంతో ఢిల్లీలో సంప్రదింపులు జరుపుతూనే వున్నారు.

హైద్రాబాదు ముఖ్యమంత్రి ఉన్నదని చెప్పవచ్చు.

శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు ఇవ్వాళ ఉపసంఘ సమావేశానికి హాజరై తెలంగాణా ప్రజాభిప్రాయాన్ని వివరించినట్లు కూడా తెలుస్తోంది.

ఏమైనప్పటికీ విశాలాంధ్ర సమస్య ఇదివరకు అనుకున్నంత సులభంగా పరిష్కారమయ్యేటట్లు లేదనీ, కష్టంగా రాత్రి గం. 7-30 నుంచి ఉదయం గం. 6 వరకూ కమ్యూనిస్టు అనుచరులు వుంటారని

బొంబాయిలో మళ్లీ పచ్చలపేటి కాల్పులు: నలుగురి మృతి

మూడుమైళ్ల ప్రాంతంలో కర్ఫ్యూ: కార్మికుల, విద్యార్థుల జనరల్ సమ్మె

బొంబాయి, జనవరి 18

బొంబాయిలో నేడు మళ్లీ పోలీసులు అనేకసార్లు కాల్పులు జరిపారు. మొత్తం నలుగురు మరణించారు. నగరంలోని మధ్య, ఉత్తర ప్రాంతాలలో చాలచోట్ల కర్ఫ్యూ విధించారు. వామపక్షపార్టీల పిలుపు ననుసరించి నేడు 60 బట్టల మిల్లులలోని కార్మికులు 20 వేలమంది రేవుకార్మికులు, విద్యార్థులు సమ్మెజేశారు.

దీనితో మొన్నటినుంచి జరిగిన కాల్పులలో మొత్తం 5 గురు మరణించారు. నేటి ఉదయం నుంచి సాయంత్రం వరకూ 393 మందిని అరెస్టు జేశారు.

బొయిబావాడీ (పరేల్), కెస్టిల్ గోడౌన్, దాదర్ ప్రాంతాలలో సాయంత్రం పోలీసులు కాల్పులు జరిపారు. బొయిబావాడీ కాల్పులలో ఇద్దరు మరణించారు. కెస్టిల్ గోడౌన్, దాదర్ కాల్పులలో ఎంతమంది మరణించారో, గాయపడింది తెలియలేదు. మధ్యాహ్నం రేవ్వారా పొయిబావాడీ ప్రాంతంలో మళ్లీ కాల్పులు జరగగా ఇద్దరు మరణించారు.

ఉదయం 10 గంటల ప్రాంతంలో పోయిబావాడీ ప్రాంతంలో కర్ఫ్యూ విధించారు. ఆర్థర్ రోడ్డులో మూడు మైళ్ళ పర్యంతం కర్ఫ్యూ అమలులోవుంటుంది. పక్కనున్న ప్రాంతాలకుకూడా కర్ఫ్యూ వ్యాప్తిస్తుంది. ఎంతకాలం ఇది అమలులో వుంటుందో తెలియదు.

బొయిబావాడీ ప్రాంతంలో ప్రజాసంఘాలు నిర్వహించిన అర్థగంటపాటు నిర్బంధం, బస్సులను ఆపడంతో పరిస్థితి ఉద్రిక్తమైనదని చెప్పి, పోలీసులు కాల్పులు సాగించారు.

ఉత్తర బొంబాయిలో పక్కనున్న, కెస్టిల్ గోడౌన్ ఒకటి కాలిపోయింది. ప్రజలు ఇళ్ళనుంచి బయటకు రావద్దని ఆదేశించారు. మధ్య బొంబాయిలో ఫినాన్సాకీ ప్రాంతంలో కార్మికులు ప్రదర్శనకు నిప్పుపెట్టి ప్రయత్నాన్ని, పోలీసులు విఫలం చేశారు.

నిన్న జరిగిన పక్షపాత కాల్పులకు నిరసనగా, బొంబాయిలో 20 వేలమంది రేవు కార్మికులు, 60 వస్త్రమిల్లుల కార్మికులు, విద్యార్థులు నేడు సమ్మెజేశారు.

ఉదయంనుంచి ఎక్కడ చూచినా విద్యార్థులు, కార్మికులు గుంపులు గుంపులుగా [illegible] ప్రదర్శనలు జరిపారు. [illegible] ఇవి శాంతియుతంగా జరిగినట్లు తెలుస్తోంది. [illegible] పోలీసులు లాఠీచార్జీలు జరిపారు. 13 [illegible] గాయపడ్డారు.

పైకుర్లాలమధ్య ప్రధానమైన రహదారులకు ప్రదర్శకులు అడ్డుగట్టులు నిర్మించారు. దీనితో బస్సు, ట్రామ్ సర్వీసులు ఆగిపోయాయి. ఈ ప్రాంతాలలో సాయుధ పోలీసులు గస్తీతిరుగుతున్నారు.

రేవు కార్మికులంతా సమ్మె చేయడంతో, రేవులోని 53 ఓడలలో సరుకులు ఎక్కేవారు, దించేవారు లేక పోయారు. పనంతా స్థంభించిపోయింది. ఉత్తర బొంబాయిలో ఇంజనీరింగ్ వర్క్‌షాపులన్నీ, మూతపడ్డాయి. హఠాత్తుగా, పరేల్‌లో రెండు గ్లాస్ వర్క్‌షాపులు కూడా పని చేయడంలేదు.

పొద్దుగడిచేకొద్దీ నడిచిన ట్రాములు, బస్సులు 10 నిముషాల్లో పరిస్థితి మారిపోవడంతో నిలిచిపోయాయి. పారిశ్రామిక ప్రాంతాలలో మరీ ఇది నడవడం ఆపివేయబడింది.

[illegible] 18 ప్రాంతాలు [illegible] కూడా సమ్మె జరిగింది. అక్కడ [illegible] 5 వేలమంది కార్మికులు సమ్మె చేశారు. అక్కడ [illegible] కూడా మూతపడ్డాయి.

ట్రాన్సిస్టర్లు, టైర్లు, రబ్బరు, అమ్మోనియా కోడ, నాఫ్తా డ, అగ్రికల్చర్, కెంకస్టరీ, [illegible] పరిశ్రమలు, కెమికల్ ప్రాంతాలు [illegible] శనివారంనాడు [illegible]

విశాలాంధ్రకు విరుద్ధంగా నిర్ణయమేవస్తే....

ఆంధ్రులపట్ల భారత ప్రభుత్వం కక్షతో వ్యవహరించినదనే నింద తప్పదని శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 17

ఆంధ్ర - తెలంగాణాలను సమైక్యంచేసి విశాలాంధ్రను ఏర్పరచాలనే నిర్ణయం రానిపక్షంలో భారత ప్రభుత్వం ఆంధ్రులపట్ల కక్షతో వ్యవహరించినదనేనింద వ్యాపించడం సహజమేనని నేడిక్కడ ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ గోపాల రెడ్డిగారు అన్నారు.

అయితే కేంద్రప్రభుత్వం తెలుగు ప్రజల వాంఛపట్ల న్యాయంగా వ్యవహరించుటలదనే ఆరోపణను వెలిబుచ్చారు.

శ్రీ గోపాలరెడ్డిగారు నిన్నరాత్రి రాష్ట్రాల పునర్నిర్మాణ సమస్యపై ప్రభుత్వ ప్రకటనను గురించి పత్రికలవారితో మాట్లాడుతూ యిలా అన్నారు:

నిన్న భారత ప్రభుత్వం చేసిన ప్రకటనతో అన్ని భాషలవారికీ ప్రత్యేకరాష్ట్రాలు ఏర్పడినట్లు స్పష్టమైంది. కమ్యూనిస్టేతర పక్షాలు గానీ మహారాష్ట్రులు గానీ మరాఠీ రాష్ట్రంలో ఉండడానికి ప్రభుత్వం నిర్ణయించడం లేదు. దానికి ప్రత్యేక రాష్ట్రాలు లేకపోతేనే. తెలంగాణా ఆంధ్రులలో విలీనం కావడానికి రాష్ట్రాల కమిషన్ అయిదేళ్లు సమయం పెట్టింది. కాని పరిస్థితియందు కమిషన్ ఆలస్యం అవసరంగా లేదు. పరిస్థితి సాధారణంగానే ప్రత్యేక రాష్ట్రంగా వుండాలని కమిషన్ అభిప్రాయపడింది. కమిషన్ తీర్పు ప్రకారమన్న అలా నిర్ణయించడం జరిగితే, ప్రాంతీయులకే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని భారతప్రభుత్వం భావించింది. అలాంటిపరిస్థితులలో తెలుగు ప్రజలకు కలిసివుండాలన్న కోరిక ఎలాంటి వ్యాకులతకు దారితీస్తుందో ఎవరూ చెప్పలేరు. ఆంధ్ర - తెలంగాణా ప్రజలలో ఏర్పడాలని తెలుగు ప్రజలు ఎంతగానో ఆశించుతున్నారో కాంగ్రెసు అధిష్టానవర్గానికీ, భారత ప్రభుత్వానికీ పరిపూర్ణంగా తెలిసిన విషయమే. విశాలాంధ్ర నిర్ణయం తప్ప వేరొక నిర్ణయమే జరిగితే ఆంధ్రులపట్ల భారతప్రభుత్వం కక్ష కట్టి వివక్షతా వైఖరిని ప్రదర్శించిందనే నిందకూడా తప్పదు.

బళ్ళారి సమస్య

బళ్ళారి సమస్యను గురించికూడా ప్రభుత్వంఇంకా తేల్చలేదు. రాయదుర్గ్‌పట్టణంలోనూ, కోలార్‌లోనూ తెలుగువారికి సమానమైన మెజారిటీ వుంది. అలాగే జిల్లాలో మహారాష్ట్రులు మెజారిటీ సంఖ్యలోవున్నారు. అయినా ఈ ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం కన్నడిగులకు యిచ్చివేసింది. అలాంటప్పుడు బళ్ళారి ప్రాంతాన్ని ఆంధ్రలో కలపాలని కమిషన్ చేసిన సిఫార్సును ప్రభుత్వం ఆమోదిస్తే కన్నడిగులు అంతగా ఎందుకు ఉద్రేకపడాలో నాకర్థం కావడం లేదు.

తుంగభద్ర ప్రాజెక్టు ప్రధానంగా రాయలసీమ ప్రజలప్రయోజనాలకోసం ఉద్దేశించబడింది. అంతేకాదు, గత మునిసిపల్ ఎన్నికల్లో బళ్ళారిపట్టణంలో ఆంధ్రులే మెజారిటీసంఖ్యలో వున్నారని స్పష్టపడింది. వీటన్నింటి దృష్ట్యా - ఎట్లయినా స్వామంతో బాధపడే రాయలసీమ ప్రజలక్షేమం దృష్ట్యా కన్నడనాయకులు బళ్ళారిప్రాంతాన్ని ఆంధ్రలో వుండడానికి అంగీకరిస్తారని నేను ఆశించుతున్నాను.

మడకశిర తాలూకా ఇకముందు కూడా ఆంధ్రలోభాగంగానేవుంటుందని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. మడకశిరవైపు భారతప్రభుత్వం సరియైన నిర్ణయం తీసుకోవడం న్యాయంగా వుంటుంది. ఎలాంటి న్యాయాలేమీ.

శ్రీ డాంగే అరెస్టు

ఢిల్లీనుంచి బొంబాయి విమానాశ్రయంలో దిగగానే

బొంబాయి, జనవరి 18

కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఎస్. ఏ. డాంగే నేడు ఢిల్లీనుంచి విమానంలో బొంబాయి చేరగానే విలాపాశ్రయంలో పోలీసులు అరెస్టుచేశారు.

1956 జనవరి 19 గురువారం
మన్మథనామ సంవత్సర
పుష్య శుద్ధ
షష్ఠి ప. 1—11
ఉ. భా. స. 12—45

విశాలాంధ్ర

19-1-56 గురువారం

విశాలాంధ్రకు అవరోధాలు

విశాలాంధ్ర నిర్మాణానికి వ్యతిరేకంగా అడ్డు పుల్లలు వేయాలని ప్రతీపశక్తులు ఆఖరు నిమిషంలో తీవ్రంగా ప్రయత్నించుతున్నట్లు ఢిల్లీనుంచి ఆందోళన కరమైన వార్తలు వస్తున్నాయి. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక 16 వ తేదీ సంచికలో ఇంతవరకు తప్పని సరిగా వస్తుందనుకున్న విశాలాంధ్ర సందిగ్ధంలో పడిందనే వార్తను ప్రకటించింది. విశాలాంధ్ర నిర్మాణానికి నూతన ప్రమాదం రాబోతూందనే శీర్షికతో 17 వ తేదీ 'మద్రాస్ మెయిల్' పత్రిక ఢిల్లీవిలేఖరి వార్తను ప్రకటించింది. 'హిందుస్థాన్ టైమ్స్', 'టైమ్స్ ఆఫ్ ఇండియా,' 'మద్రాసు మెయిల్' వగైరా బడా బూర్జువాపత్రికలు, తెలంగాణా ప్రజలకు – ఆంధ్ర ప్రాంతాల ప్రజలకు మధ్య ఏదో తీరని అగాధ మున్నట్లుగా చిత్రించిన శ్రీ యస్. కె. పాటిల్ కల్లిబొల్లి రిపోర్టును ప్రముఖంగా ప్రకటించాయి. ఇదంతా చూస్తే, ముక్కోటి తెలుగు ప్రజల జాతీయ వాంఛనుతృణీకరించడానికి తీవ్రమైన కుట్రలు జరుగుతున్నాయని ద్యోతకమవుతుంది.

ఫజలలీ కమిషన్ సైతం ఆంధ్ర – తెలంగాణాల విలీనీకరణ అవశ్యకతను గుర్తించింది. నవంబరులో జరిగిన కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశం అన్నిరాష్ట్రాల పునర్విభజనతో పాటు విశాలాంధ్రను కూడ ఏర్పరచడమే తమ అభిమతమని స్పష్టంగా ప్రకటించింది. భారత పార్లమెంటు ఉభయ సభల చర్చలకు ప్రభుత్వం తరఫున సమాధానమిస్తూ ప్రధాని నెహూ, హోంశాఖామంత్రి శ్రీ గోవిందవల్లభ పంత్ విశాలాంధ్ర నిర్మాణానికి తమ సుముఖతను వెల్లడించారు కూడ.

వీటన్నిటినీ గమనించిన తెలుగుప్రజానీకమంతా, కొన్ని శతాబ్దాలుగా తమ జాతికి జరిగిన అన్యాయం తొలగిపోతుందనీ, ఆంధ్ర జాతీయైక్యత సిద్ధించబోతూందనీ సంతోషించారు. విశాలాంధ్ర నిర్మాణం ద్వారా ముక్కోటి తెలుగు ప్రజలు ఒకే రాష్ట్ర పాలన క్రిందకు వచ్చే శుభసమయం ఆసన్నమయిందని ఆనందించారు.

కాని 16వ తేదీన రాష్ట్రాల పునర్విభజనను గురించి ప్రధాని నెహూ యిచ్చిన రేడియో ఉపన్యాసంలో విశాలాంధ్ర ప్రసక్తే లేకపోవడం తెలుగు ప్రజలందరికి భయాందోళనలు కలిగించింది. అదేరోజున విడుదలయిన కేంద్రప్రభుత్వ ప్రకటనలో విశాలాంధ్ర నిర్మాణం విషయమై యింకా సమాలోచనలు జరుగుతున్నట్లుగావుంది. అగ్రనాయకులు, పార్లమెంటు సభ్యులలో అత్యధిక సంఖ్యాకులు సుముఖత వెల్లడించిన విశాలాంధ్రను గురించి ఇంత కాలయాపన ఎందుకు జరుగుతుందా అనే సందేహం చాలా మందికి కలిగింది. కాంగ్రెసు అధిష్టానవర్గం, కేంద్రమంత్రులు తమ వాగ్దానాలపై నిలబడతారా? లేరా? అనే ప్రశ్న నలుదెసలనుండి వస్తున్నది.

ఢిల్లీనుంచి వస్తున్న వార్తలనుబట్టి భాషారాష్ట్రాలకు బద్ధ శత్రువైన శ్రీ యస్. కె. పాటిల్ ఆంధ్ర జాతీయైక్యతకు వ్యతిరేకంగా కృషిచేస్తున్నట్లు తెలుస్తూంది. తెలంగాణావాదులను రెచ్చగొట్టడానికే పాటిల్ నిలువని పేరంటంగా హైద్రాబాద్‌కు వచ్చారు. తెలంగాణా ఆంధ్ర ప్రాంతాల ప్రజలమధ్య ఏదో పెద్ద అంతరమున్నట్లుగా చిత్రించే రిపోర్టును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి అందజేశారు.

ఇంతేగాక ఉపసంఘ సభ్యులైన విద్యామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌కూడ ప్రత్యేక తెలంగాణా వాదులను అభిమానించుతున్నట్లు తెలుస్తూంది. పోలీసు చర్య సమయంలో హైద్రాబాద్ ముస్లిములు నష్టపోయారనీ, విశాలాంధ్రలో ముస్లిం మైనారిటీ ప్రయోజనాలకు ఏదో భంగం రాబోతూందనీ వాదించుతున్నారట. అందుచేతనే దీర్ఘ సమాలోచనలు అవసరమై కాలయాపన జరుగుతూన్నట్లు చెప్పబడుతూంది.

ఏమైనప్పటికీ, ఆంధ్రప్రజలు తమ న్యాయమైన వాంఛ దానంతటది ఈడేరు తుందనే ఏమరుపాటుతో వుండరాదు. మన జాతీయ లక్ష్యానికి అడ్డుపుల్లలు వేయడానికి అభివృద్ధి నిరోధకులు తీవ్రంగా ప్రయత్నించుతున్నారు. అందుచేత ఈ కుట్రలను భగ్నం చేయడానికి ముక్కోటి తెలుగు ప్రజలు వెంటనే దీక్షవహించాలి.

అన్నిరాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఆంధ్రజాతి శ్రేయస్సును కోరేవారందరూ తక్షణమే కర్తవ్యోన్ముఖులు కావాలి. ఆంధ్రదేశమంతటా సభలు, పూరేగింపులు జరిపి విశాలాంధ్ర కోర్కెనుఎలుగెత్తి చాటాలి. ఉపసంఘ సభ్యులైన ప్రధాని నెహూకు, ఆజాద్, ధేబర్, పంత్ లకు టెలిగ్రాములు పంపాలి. రాజకీయవిభేదాలతో నిమిత్తం లేకుండా అన్నిపార్టీలకు, గ్రూపులకు చెందినవారు ఐక్యంగా కృషి చేస్తారని ఆశించుతున్నాం. అఖిలపక్ష సమావేశాలు, పూరేగింపులు, హర్తాళ్లు జరిపి మన జాతీయ వాంఛను సాధించడంలో ముక్కోటి తెలుగుప్రజల సమైక్యతను నిరూపించుకోవాలి.

తెలుగు ప్రజలందరికీ యిది పరీక్షాసమయం. మనలక్ష్యాన్ని సాధించడంలో అకుంఠిత దీక్షను, త్యాగపటిమను ప్రజానీకం చూపుతుందని విశ్వసించుతున్నాం.

లేడీ మౌంటుబాటన్ ఇండియా రాక

బొంబాయి, జనవరి 17

భారత మాజీ వైస్రాయి సతి లేడీ మౌంటుబాటన్ నేడు ఇండియాకు వచ్చారు. ఆసెకు విమానాశ్రయంలో బొంబాయి గవర్నర్ శ్రీ హరికృష్ణ మహతాబ్, ముఖ్యమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి స్వాగతం యిచ్చారు.

ఆమె ఇండియాలో పదిరోజులు బసచేస్తారు. ఢిల్లీలోభారతప్రధాని నెహ్రూతో వ్యక్తిగత అతిథిగా ఆయన ఇంటిలోనే లేడీ మౌంటుబాటన్ బస చేస్తారు.

భారత - సోవియట్ శాస్త్రీయ సహకారం

సోవియట్ శాస్త్రజ్ఞుని ఆశాభావం

కలకత్తా, జనవరి 17

విజ్ఞానశాస్త్ర రంగంలో భారత సోవియట్ సహకారం, ఈ ఇరుదేశాలకు లాభసాటిగా మరింత అభివృద్ధి పొందుతుందని సోవియట్ శాస్త్రవేత్త అల్యాండర్ టాట్సీవ్ నేడిక్కడ అన్నారు. ఆగ్రాలో జరిగిన భారతీయ విజ్ఞానశాస్త్ర మహాసభకు, హాజరైన సోవియట్ ప్రతినిధివర్గానికి ఈయన నాయకత్వం వహించారు.

భారత గణిత శాస్త్రసంస్థ డైరెక్టర్ శ్రీ పి. సి. మహాలనోబిస్ సోవియట్ శాస్త్రజ్ఞులకు సన్మానం జరిగిన సందర్భంలో టాట్సీవ్ మాట్లాడుతూ తను భారతదేశ పర్యటనలో సోవియట్‌తో మైత్రి పెంపొందించుకోవాలనే భారతప్రజలఆకాంక్షనుస్పష్టంగా గుర్తించామన్నారు. ఉభయదేశాలమధ్య ఉన్నట్టి విషయాలసేకం వున్నాయనీ, అందుచేత వారు పరస్పరం సులభంగా అవగాహన చేసుకోగలరని అన్నారు.

అమెరికాసాయాన్ని నిరాకరించాలి

శ్రీ జె. జె. సింగ్ హితవు

న్యూఢిల్లీ, జనవరి 17

అమెరికానుంచి సహాయాన్ని ఇక భారత దేశం నిరాకరించాలని, అమెరికాలోని ఇండియాలీగ్ అధ్యక్షుడు శ్రీ జె. జె. సింగ్ నేడిక్కడ అన్నారు. అట్టి సహాయాన్ని అంగీకరించడంవల్ల ఉభయ దేశాలమధ్య సంబంధాలు చెడిపోగలవన్నారు.

తమ సహాయాన్ని ఎవరైతే స్వీకరిస్తారో వారినుంచి అమెరికా కొన్ని లాభాలను ఆశిస్తుంది. అందుకు ఇండియా సిద్ధంగాలేదు. అందుచేత అమెరికాలో ఆశాభంగం, విద్వేషం ఏర్పడుతున్నాయి అని శ్రీ సింగ్ అన్నారు.

అసలు అమెరికా సహాయం లేకుండానే ఇండియా గడుపుకోగలదు. ఆ సహాయాన్ని నిరాకరిస్తే మన జాతీయ ప్రతిష్ఠ పెరుగుతుంది అని అన్నారు.

కమ్యూనిస్టు దేశాల నుంచయినా సహాయమనేది కూడదని, సహాయం లేకుండా వస్తుకం మన లక్ష్యంగా వుండాలని శ్రీ సింగ్ పేర్కొన్నారు.

'లైఫ్' పత్రికలో తాను తెలిపిన అభిప్రాయాలు సరియయినవేనట: డల్లెస్

వాషింగ్టన్, జనవరి 17

ఆటం బాంబులతో యుద్ధంచేస్తానని తాను అమెరికా ప్రభుత్వాన్ని బెదరించడంవల్ల బూడుసాస్త్రయుద్ధాన్ని నివారించానని డల్లెస్ ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపినట్లు 'లైఫ్' పత్రిక రాసిన వ్యాసం గురించి, డల్లెస్ నేడు జరిపిన పత్రికా గోష్ఠిలో ప్రశ్నోత్తరాలు జరిగాయి.

విలేఖరుల ప్రశ్నలు ప్రారంభమయేముందు డల్లెస్ తాను రాసుకొచ్చిన ఒక ప్రకటనను చదివి వినిపించారు.

'లైఫ్' వ్యాసంలోని అభిప్రాయాలనే ఇంచుమించుగా ఈ ప్రకటనలో మరొకసారి నొక్కివెప్పారు.

ఇందులో ఇలా అన్నారు:

"యుద్ధంలో చిక్కుకోకుండా ఉండేందుకు అమెరికా గౌరవప్రదమైన మార్గాలన్నిటినీ అనుసరించాలనేదే నా అభిప్రాయం. నిజానికి, న్యాయమైన సుస్థిరమైన శాంతి సాధనకే నా జీవితాన్నంతా అంకితం చేశాను.

"కాని, ప్రాథమిక నైతిక సూత్రాలూ, ముఖ్యమయిన ప్రయోజనాలూ మనకు కొన్ని ఉన్నాయని నానమ్మకం. అవసరమైతే ప్రాణాన్ని కూడా ఒడ్డి వీటిని రక్షించుకోడానికి సిద్ధంగా ఉన్నామని ముందుగానే స్పష్టం చేయడం, యుద్ధాన్ని నివారించేందుకు ఉత్తమోత్తను మార్గమని నా విశ్వాసం.

"ఈవిధంగా మన వైఖరిని ముందుగానే స్పష్టం చేయాలనే విధానంలో కొన్ని ప్రమాదా లున్నాయి. అది తెలిసిఉండికూడా, శాంతి కోసం దానిని అనుసరించాలి. ఇలా, మన వైఖరిని ముందే తెలపకపోవడంవల్ల యుద్ధం వచ్చే అవకాశాలు ఎక్కువని మా అనుభవం. ముందుగా తెలపకపోతే, దురాక్రమణగారులు తప్పు అంచనాలు వేసుకోవచ్చు."

ప్రశ్నల వర్షం

తాను రాసుకొచ్చిన ఈ ప్రకటన చదివిన తరువాతి, విలేఖరులు డల్లెస్‌పై ప్రశ్నలవర్షం కురిపించారు.

'లైఫ్' వ్యాసంలో కొంత అస్పష్టత ఉందని డల్లెస్ అన్నారు.

అయినా, తాను వెల్లడించిన అభిప్రాయాలుగా ఆ పత్రిక తెలిపిన విషయాలు సరియయినవే అనీ, చాలసార్లు తాను చెప్పినదానికన్నా, అందులో కొన్నిఏమీ లేదనీ అన్నారు. పైపెచ్చు కొరియా, పైవాన్, ఇండోచైనా రంగాలలో "కమ్యూనిస్టు దురాక్రమణ" తిరిగి ప్రారంభం కాకుండా ఆపడంలో ఆ పత్రిక తనకు "ఎక్కువ ప్రాముఖ్యత" ఇచ్చినందుకు "విచారం" తెలిపారు.

"అమెరికా యుద్ధకూపం అంచుకి వచ్చిన మాట నిజం. ఆ కూపంలో పడకుండా, అందుకు చేరుకోవడం ఆవశ్యకమయిన కళ" అని తానన్నట్లు 'లైఫ్' పత్రిక వ్యాసంలో ఉన్న మాటలను పేర్కొని, సందర్భశుద్ధిలేకుండా ఆ మాటలను చదివితే అస్పష్టంగా ఉంటుందన్నారు. అలా చదివితే ఆ అంచుకు చేరుకోవడమే తమ అభిమతమనే అభిప్రాయానికి అవకాశం యిస్తుందన్నారు.

"శాంతిని గురించి నా అభిప్రాయాలను ఇదివరకు చాలసార్లు చెప్పాను. విదేశాంగ విధానానికి సంబంధించిన అనేక చిక్కు సమస్యలను గురించిన ఈ వ్యాసంలో సమస్యను కొంత చులకన చేయడమూ, తక్కినవాటిని కొంత నొక్కివెప్పడమూ జరుగుతుంది. అంతమాత్రంచేత నా అభిప్రాయాలు మారిపోయాయని అనుకోనక్కరలేదు" అని అన్నారు.

గుంటూరు జిల్లా కమ్యూనిస్టు మహాసభ తీర్మానం

తెనాలి, జనవరి 18

ఇక్కడ జరుగుతున్న గుంటూరు జిల్లా కమ్యూనిస్టుమహాసభ బొంబాయి భవిష్యత్తుగురించిన ప్రభుత్వ నిర్ణయాన్నీ, విశాలాంధ్ర సమస్యపై కాలయాపననూ నిరసిస్తూ, దిగువ తీర్మానం చేసింది:

ఒకవైపు బొంబాయి చుట్టూ మహారాష్ట్ర ప్రాంతం వుందని, బొంబాయి మహారాష్ట్రంలో భాగమేననీ ప్రధాని నెహూ అంగీకరిస్తూనే బొంబాయిలోని గుత్తిపెట్టుబడి దారులకు లొంగి మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా బొంబాయిని కేంద్రపాలనలోకి తీసుకునే నిర్ణయాన్ని ప్రభుత్వం చేసింది. తన యీ ప్రజావ్యతిరేక నిరంకుశ నిర్ణయాన్ని మార్చుకుని, బొంబాయిని చేర్చి బృహన్మహారాష్ట్ర యేర్పర్చాలనే మహారాష్ట్ర ప్రజల న్యాయమైన కోర్కెను తక్షణమే అంగీకరించాలని కోరుతూ, దమననీతితో అశాంతిని రెచ్చగొట్టవద్దని హెచ్చరిస్తున్నాం. తమ న్యాయమైన కోర్కెను ప్రభుత్వం త్రోసిపుచ్చుతూ చేసిన నిర్ణయాన్ని, అమలుజరిపే నిర్బంధవిధానాన్ని ఎదుర్కొంటూ ఐక్యతతో వీరోచితంగా పోరాడుతున్న మహారాష్ట్ర ప్రజలను ఈ మహాసభ అభినందించుతోంది.

ఆంధ్ర, తెలంగాణా ప్రజలు వివిధ రాజకీయాభిప్రాయాలు గల పార్టీలు, వ్యక్తులు విశాలాంధ్ర తక్షణమే ఏర్పరచాలని అభిప్రాయం వెల్లడిస్తున్నా, కొద్దిమంది స్వార్థపరులు పెట్టే ఆటంకాలను ఆధారం చేసుకొని విశాలాంధ్ర విషయంలో నిర్ణయం చేయడానికి జరుగుతున్న కాలయాపన అనుమానాస్పదంగా వుంది. తక్షణ విశాలాంధ్ర నిర్మాణవాంఛను నిరాకరించే ఆలోచనలు జరుగుతున్నట్లు వార్తలువస్తున్నాయి. కొద్దిమంది స్వార్థపరుల అభ్యంతరాలను సాకుగా తీసుకొని బొంబాయి పరిస్థితులను కల్పించవద్దని యీ మహాసభ ప్రభుత్వాన్ని హెచ్చరించుతున్నది.

పాక్ హైకమిషనర్ గజన్ఫరీ

ఖాన్ ఢిల్లీలో మౌలానా ఆజాద్‌ని కలుసుకుని, ఉభయదేశాలకు సంబంధించిన సమస్యలను గూర్చి చర్చించారు.

♦ ♦ ♦

జనవరి 23 న నేతాజీ సుభాష్‌బోస్ దినం జరపాలని ప్రజా సోషలిస్టుపార్టీ నిర్ణయించింది.

ద్వితీయ ప్రణాళిక పూర్తయేసరికి నిరుద్యోగం హెచ్చే ప్రమాదం

కాంగ్రెస్‌కార్యదర్శి శ్రీమన్నారాయణ హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 17

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పూర్తయ్యేనాటికి మన దేశంలో నిరుద్యోగులసంఖ్య మరొక 20 లక్షలు పెరగవచ్చునని కాంగ్రెసు కార్యదర్శి శ్రీమన్నారాయణ అభిప్రాయం వెలిబుచ్చారు.

అఖిలభారతకాంగ్రెస్‌కమిటీపత్రిక "ఎకనామిక్ రివ్యూ"లో ఆయన ఒక వ్యాసం రాస్తూ ద్వితీయ ప్రణాళికలో ఉద్యోగాలకల్పన గురించి ఇంతవరకు వచ్చినసూచనలు, ఆశాజనకంగా లేవన్నారు. వచ్చే ఐదేండ్లలో పనిచేసేస్థోమతగలవారిసంఖ్యకోటి పెరుగుతుంది. అందులో ఇప్పటి అంచనాలప్రకారం 80 లక్షలకు మాత్రమే మనం పని చూపించగలిగితే, ద్వితీయ ప్రణాళిక ముగిసేనాటికి మనదేశంలో నిరుద్యోగులసంఖ్య 20 లక్షలు పెరుగుతుంది అని శ్రీమన్నారాయణ అన్నారు.

"అంబర్ చర్కాలవల్ల 30-40 లక్షల ఉద్యోగాలు యేర్పడుతాయనే విషయాన్ని ప్లానింగ్ కమిషన్ దృష్టిలోకి తీసుకున్నట్లులేదు. ఇలాంటి వికేంద్రీకృత జవుళి పరిశ్రమకు అవకాశం ఇవ్వాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖనిర్ణయించడం అవసరం.

వచ్చే ఐదేండ్లలో చిన్న తరహా గ్రామీణ, పరిశ్రమలమీద 200కోట్లు ఖర్చుపెట్టాలని సంకల్పించారు. అయితే ఇంతడబ్బు ఖర్చుపెడతామని చెప్పినంత మాత్రంచేత లాభంలేదు. ఈ చిన్న పరిశ్రమలను గ్రామాలలో పట్టణాలలో స్థాపించడానికి, ప్రభుత్వం ప్రజలసహకారాన్ని సంపాదించాలి."

భూ విధానాన్ని ప్రస్తావిస్తూ శ్రీమన్నారాయణ, "వ్యవసాయ సంస్కరణలలో సుందరగతిని వేగం సహించదనే విషయాన్ని, అంతా స్పష్టంగా అర్థంచేసుకోవలసి వుంది" అని అన్నారు.

"భూసంస్కరణల్లో మనం కొన్ని ఫలితాలు సాధించినప్పటికీ, యీ రంగంలో మన పురోగతి నిరుత్సాహజనకంగా వుందని ఖచ్చితంగా అంగీకరించవలసివుంది. అందుచేత, ద్వితీయప్రణాళికలో భూ విధానం ఇప్పటికన్న ధైర్యవంతంగా, సమగ్రంగా వుండాలి. దానిని ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో అమలు జరపాలి" అని అన్నారు.

శ్రీ జి. వి. కృపానిధికి కొత్తపదవి

మద్రాసు, జనవరి 17

"హిందుస్థాన్ టైమ్స్" సంయుక్త సంపాదక పదవినుంచి విరమించుకున్న శ్రీ జి. వి. కృపానిధిగారిని దక్షిణాది భాషలలో గ్రంథప్రచురణ సంస్థ జనరల్ మేనేజరుగా నియమించారు. దక్షిణాదిభాషలలో చదువరులకు ఉద్గ్రంథాలను ప్రచురించడానికి దక్షిణదేశంలోని యూనివర్సిటీల ఉపాధ్యక్షులుఈసంస్థను ఏర్పరచారు. అక్టోబరులో ప్రధాని నెహ్రూ దీనికి ప్రారంభోత్సవం జరిపారు.

ఆంధ్రరాష్ట్ర పత్రికా రచయితల సదస్సు

విజయవాడలో 22 వ తేదీన

మద్రాసు, జనవరి 17

ఆంధ్రరాష్ట్ర పత్రికా రచయితల సంఘాన్ని స్థాపించుకోవానికి ఆంధ్ర పత్రికా రచయితల సదస్సు విజయవాడలో జనవరి 22 న జరుగుతుందని, భారత పత్రికా రచయితల సమాఖ్య కార్యదర్శి శ్రీ సి. యస్. చిత్తరంజన్ ప్రకటిస్తున్నారు.

బొంబాయి శాసనసభ బడ్జెట్ సమావేశం ఫిబ్రవరి 16న ప్రారంభమవుతుంది.

రష్యా విజయాల పట్ల ఆసియా ప్రజల ఆకర్షణ

డల్లెస్ తీవ్ర ఆందోళన

వాషింగ్టన్, జనవరి 17

బడుగులకు ముఖ్యంగా ఆసియా దేశాలకు దీర్ఘకాలం ఆర్థికసహాయాన్ని అందజేసేందుకు అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ కోరిన ప్రత్యేక చట్టాలు ఇవ్వవలసిందని డల్లెస్ నేడే విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై విలేఖరుల సభలో ప్రసంగిస్తూ ఇలా అన్నారు:

"ఆర్థిక సహాయం విషయంలో సోవియట్ ఎత్తుగడలను ఎదుర్కొడానికి ఇది అవసరం. గత 30 ఏళ్లలో, ముఖ్యంగా గత పదేళ్ళలో సోవియట్ సాధించిన సత్వరపారిశ్రామికాభివృద్ధి, దాని ఇరుగుపొరుగు ఆసియా దేశాలలో చాల తన్మయిత కలిగించింది.

"అయితే సోవియట్ చాల క్రూరమయిన, అమానుష విధానాల ద్వారా ఈ అభివృద్ధి సాధించింది.

"అయినప్పటికీ, అది సాధించిన ఫలితాలు వెనుకబడిన ఆసియా దేశాల ప్రజలను ఆకర్షించింది. ఆర్థిక స్వాతంత్ర్యం వైపు పెద్ద ముందంబ వేస్తేనేతప్ప తమ స్వాతంత్ర్యం సమగ్రం కాదు అని ఆ ప్రజలు భావిస్తున్నారు.

"అత్యవసర పరిస్థితుల్లోమాత్రమే సహాయక పథకాలు వేసుకుంటే, సోవియట్ పోటీని తట్టుకొని నిలవలేము. వెనుకబడినదేశాలు తమ లక్ష్యాలను సాధించేందుకు అమెరికా సహకరించాలి."

బొగ్గుగనుల యజమాన్లపై చర్య

భారతప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 18

మధ్యప్రదేశ్‌లోని న్యూటన్ చిల్లీ బొగ్గుగని యజమానులనైన, బీహార్‌లోని ఆస్లంబాద్ బొగ్గుగని యజమానులనైన తీవ్ర చర్య తీసుకోవాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండుగనుల్లో రెండు ప్రమాదాలుజరిగి ఇదివరలో 114 మంది చనిపోయారు.

ప్రభుత్వ గనుల శాఖ పర్యవేక్షణ సిబ్బందిమీద కూడా తగు విచారణ జరిపిన మీదట చర్య తీసుకోవాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఆస్లంబాద్ గనిప్రమాదంపై విచారణ జరిపిన హైకోర్టు జడ్జీల కమిటీ, గనులశాఖ పర్యవేక్షణ సిబ్బంది ఆస్లంబాద్ గనిలో తమ కర్తవ్యాలు సరవేర్చలేదని అభిప్రాయపడింది.

గనులలోనున్న రక్షణ నిబంధనలను పరిశీలించడానికి త్రైపాక్షిక సంఘాన్ని నియమించాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

ఫిజికల్ ట్రెయినింగ్ ఉపాధ్యాయులు

లోయర్ గ్రేడువారికి హైస్కూళ్ళలో బోధించే అవకాశం

కర్నూలు, జనవరి 17

ఐదేళ్లు సర్వీసున్న లోయర్ గ్రేడ్ ఫిజికల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, హైస్కూళ్లలోసింగిల్ ఇన్‌స్ట్రక్టర్లుగా గాని, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లుగాగాని నియమితులుకావచ్చునని, ఆంధ్రప్రభుత్వం ఉత్తర్వునేసింది. అయితే అలాంటివారి సర్వీసు, పని సంతృప్తికరంగావుందని, స్కూలు యజమానులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ ప్రకటించాలి.

ఐదేళ్లు సర్వీసులేనివారిని హైస్కూలులో నియమించగోరితే వారికి మినహాయింపు సంపాదించి వుండాలి. ఇంతేగాక లోయర్ గ్రేడ్ ఇన్‌స్పెక్టర్లకు హైస్కూలులో బోధించే అవకాశాలులేవు.

'వైసుంచి రుద్దినంతమాత్రాన అన్యాయం న్యాయం కాజాలదు'

మహారాష్ట్రనాయకుడు శ్రీ గాడ్గిల్ ఉద్ఘాటన

పూనా, జనవరి 17

బొంబాయి నగరాన్ని కేంద్ర పరిపాలన క్రిందకు తీసుకోవడం ప్రజాతంత్ర సూత్రాలన్నింటికీ పూర్తిగా విరుద్ధమని శ్రీ యస్. బి. గాడ్గిల్ నేడు కాంగ్రెసుభవనంలో కాంగ్రెసు సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేసిన ఈ అక్రమనిర్ణయాన్ని మార్చడానికి రాజ్యాంగానికీ, ప్రజాతంత్ర సూత్రాలకు లోబడి అన్ని రకాలుగా యత్నించాలని ఆయన కోరారు. వైసుండి బలవంతంగా రుద్దినంత మాత్రాన అన్యాయం న్యాయం కాజాలదని ఆయన ఉద్ఘాటించారు.

మహారాష్ట్రేతర ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి నష్టంవాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం మహారాష్ట్రులందరిపైనా, ముఖ్యంగా కాంగ్రెసువారిపై గలదని ఆయనన్నారు. ఎవరెంత రెచ్చగొట్టినా ఇతరుల ప్రాణాలకు, ఆస్తులకు హానికలుగకుండా ప్రయత్నించడం మహారాష్ట్రుల సాంప్రదాయమని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహారాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ టి. ఆర్. దేవగిరికర్ సమావేశంలో ప్రసంగిస్తూ గురువారం నాడు జరుగబోయే కార్యవర్గ సమావేశానికి హాజరవటానికి విదర్భ నాయకులు అంగీకరించారని తెలిపారు. మహారాష్ట్రులోని అన్ని ప్రాంతాల నాయకులు సమావేశమై భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్ణయించుతారని ఆయన చెప్పారు.

ఆంధ్రుల ఆందోళన

(1 వ పేజీతరువాయి)

చాలని కోరుతూ తంతులు పంపారు.

ముస్లింల విజ్ఞప్తి

జమయత్ ఉల్‌ఉలేమా సంఘం, ఆజాద్ లైబ్రరీల కార్యదర్శి శ్రీ యం. ఎ. కరీం, విజయవాడ నేషనలిస్టు ముస్లిం సంఘం అధ్యక్షులు డాక్టరు యం. ఎ. ఖాన్, తిరస్ఖీపసంద్ ముస్లిం జమాత్‌వారు పంపిన తంతులలో "ఆంధ్రలోని ముస్లిములంతా ఏకగ్రీవంగా సత్వర విశాలాంధ్ర నిర్మాణాన్ని వాంఛిస్తున్నారని" తెలియజేశారు. విశాలాంధ్రకు అనుకూలమైన ప్రకటనకొరకు ఆతురత ఎదురు చూస్తున్నామని తెలియజేశారు.

తీవ్రపరిణామాలు వస్తాయని హెచ్చరిక

"తక్షణమే విశాలాంధ్రను నిర్మించుతూ ప్రకటించకపోతే ఆంధ్ర ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి కలగడమే కాక, తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. ఆంధ్ర కాంగ్రెసు చావు దెబ్బతింటుందని" హెచ్చరిస్తూ ఆంధ్రరాష్ట్ర జాతీయ ప్రోడీయూనియన్ కాంగ్రెసు ఉపాధ్యక్షులు శ్రీ సయ్యద్ అప్పలస్వామిగారుతంతిపంపారు. కృష్ణాజిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్, విజయవాడ సిటీ కన్వేయన్స్ వర్కర్స్‌యూనియన్, నేషనల్ క్వారీవర్కర్స్ కోఆపరేటివ్ యూనియన్‌లవారుకూడ తంతులుపంపారు.

ఆంధ్రరాష్ట్ర ప్రోడ్ యూనియన్ కాంగ్రెస్, రాష్ట్రవిద్యార్థి ఫెడరేషన్, ఆంధ్రరాష్ట్ర యువజన ఫెడరేషన్, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, ఆంధ్రా హోటల్ వర్కర్స్ యూనియన్, కృష్ణాజిల్లా యువజనసంఘం, కృష్ణాజిల్లా విద్యార్థి ఫెడరేషన్, విజయవాడ విద్యార్థి ఫెడరేషన్ విజయవాడ తాలూకా రైతుసంఘం, విజయవాడ తాలూకా వ్యవసాయ సంఘం, విజయవాడ తాలూకా కమ్యూనిస్టు కమిటీ, విజయవాడపట్టణ కమ్యూనిస్టు కమిటీ, పట్టణ మహిళా సంఘం, పట్టణప్రెస్‌వర్కర్స్ యూనియన్, పట్టణకార్మికసంఘం, సిటీ ట్రేడ్ యూనియన్, పట్టణ మోటార్ వర్కర్స్‌యూనియన్, ఫ్యాక్టరీ లేబర్‌యూనియన్, మొదలైన ప్రజా సంఘాలవారు తక్షణ విశాలాంధ్రను కోరుతూ తంతులుపంపించారు.

ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం వారు "ఆంధ్రుల సాంస్కృతికాభివృద్ధికి సత్వరమే విశాలాంధ్రను నిర్మించాలని ఆశ్యర్థిస్తూ" ప్రధాని నెహ్రూ, మౌలానా ఆజాద్‌గార్లకు నేడు తంతిపంపారు.

విజయవాడ న్యాయవాదుల సంఘ అధ్యక్షులు శ్రీ పాటిబండ్ల అప్పారావు, విజయవాడ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాగంటి సూర్యనారాయణగారు, విజయవాడ కాంగ్రెసు శాసనసభ్యులు శ్రీ మరుపిళ్ళ చిట్టిగారు, పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకట రత్నంగారు రాష్ట్రంమే విశాలాంధ్రను నిర్మించుతూ ప్రకటనచేయవలసిందిగా ప్రధాని నెహ్రూ, ఆజాద్, పంత్, ఢేబర్ గార్లను కోరుతూ నేటి ఉదయం తంతులు పంపించారు.

నగరంలోని ఈస్టర్న్ ఏజెన్సీస్, 28 అండ్‌కో, సిటీమోటార్‌స్టోర్సు, సిటీ సైకిల్‌స్టోర్సు, అజంతామహాలోటల్‌వారు కూడ సత్వర విశాలాంధ్రను కోరుతూ తంతులు పంపారు.

మున్సిపల్ చైర్మన్ తంతి

విజయవాడ పట్టణంలోని రెండు లక్షలమంది ప్రజానీకం తరఫున సత్వర విశాలాంధ్ర నిర్మాణాని కనుకూలంగా నిర్ణయం చేయవలసిందిగా కోరుతూ మున్సిపల్ చైర్మన్ శ్రీ పోతిన గణపతిరావుపాత్రుడుగారు ప్రధాని నెహూ ప్రభృతులకు తంతిచేసారు. నవంబరు 4 వ తేదీన విజయవాడ మున్సిపల్ కౌన్సిల్ తెలుగు మెజారిటీ ప్రాంతాలన్నిటితో విశాలాంధ్ర నేర్పరచాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించిందనీ, ఆ తీర్మానం కేంద్రానికప్పుడే తెలియజేశామనీ, తక్షణ విశాలాంధ్రను యేర్పాటు చేస్తూ నిర్ణయించాల్సిందిగా తిరిగి మున్సిపల్ కౌన్సిల్ అభ్యర్థిస్తున్నదనీ ఆ తంతిలో తెలియజేశారు.

ఆంధ్రదేశమంతటా హర్తాలుకు సన్నాహాలు

విశాలాంధ్ర నిర్మాణానికి అవరోధాలు కల్పించుతున్న కాంగ్రెసు అధిష్టానవర్గ ఉపసంఘం వైఖరికి నిరసనగా ఆంధ్రలో పలుచోట్ల హర్తాల్ జరపడానికి ప్రయత్నాలు జరుపుతున్నట్లు విజయవాడకు చ

'సమర్థులైన పండితులు వేస్తేనే గండపెండేరం'

ఇతరులు వేస్తే స్వీకరించబోను
గుడివాడసభలో కవిసమ్రాట్ స్పష్టీకరణ

గుడివాడ, జనవరి 16

"ఎకరు పడితే వారు కనకాభిషేకాలు చేయగలరు. గండపెండేరాలు వేయరాదు. సమర్థులైన పండితులు నిర్ణయిస్తేనే కాని అవి జరగకూడదు. అందువల్ల నేను వాటిని స్వీకరించను." అని కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు గుడివాడలో తన షష్టిపూర్తి సందర్భంలో అన్నారు.

కార్యక్రమం ప్రకారం శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి ఈ నెల 14వ తేదీ ఉదయం మంగళస్నానం, గజారోహణ, 15వ తేదీ కనకాభిషేకం, గండపెండేరం వేయడం వున్నాయి. ఇందుకు ఆయన తన అక్షేపణను తెలియజేస్తూ, సైగ్నిగా చెప్పారు. "ఆంధ్రదేశ మంతటినుండి ప్రముఖ కవులను, పండితులను రప్పించండి. నా రామాయణ కల్పవృక్షాన్ని చదివి వినిపిస్తాను. దానిలోతులు చెప్తాను. కవి పండితులు చర్చించి 'సెబాస్' అని నిర్ణయించి నివ్వండి. అప్పుడు కనకాభిషేకాలూ, గండపెండేరాలూ" అన్నారు.

ఆయన సూచనను పురస్కరించుకొని వచ్చే శ్రీరామనవమికి ఆ విధంగానే చేయించడానికి బేతపోలు పౌరులు శ్రీ కతారి సత్యనారాయణరావుగారు అంగీకరించారు.

శ్రీ విశ్వనాథ షష్టిపూర్తి ఉత్సవ సభలు మునిసిపల్ హైస్కూలు ఆవరణలో జరిగాయి. ప్రతిరోజూ వెయ్యి మొదలు రెండువేలమంది వరకూ హాజరయ్యారు. రాత్రిళ్లు నాటక, భరత నాట్య ప్రదర్శనలు జరిగాయి. వీటికి మూడు వేలమంది వరకూ హాజరయ్యారు.

మొదటిరోజు ఉదయం 60 జతల ఎడ్లతో, సన్నాయి మేళాలతో కవిసమ్రాట్ ను కారు పై, ఆయన గ్రంథాలను ఏనుగుపై పురవీధుల గుండా ఊరేగించారు.

సభలకు ఉయ్యూరు కుమారరాజా, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, కాటూరి వెంకటేశ్వరరావు, ముక్త్యాల జమీందారుగార్లు అధ్యక్షత వహించారు. అడుసుమిల్లి నారాయణరావుగారు సన్మాన సంఘం తరఫున సన్మానపత్రం చదివారు.

ముప్పయి మందికిపైగా వక్తలు సభలో పాల్గొన్నారు. వీరిలో కొందరు ప్రముఖులు వేలూరి శివరామశాస్త్రి, దాశరథి, నారాయణరెడ్డి, దివాకర్ల వెంకటావధాని, పెనుమత్స సత్యనారాయణరాజు, జమ్మలమడక మాధవరామశర్మ, జంధ్యాల పాపయ్యశాస్త్రి, సామవేదం జానకిరామశర్మ, గార్లు. ఉపన్యాసకులలో దాదాపు సగంమంది కవి సమ్రాట్‌ను స్తోత్రం చేశారు. మిగతావారు కవి సమ్రాట్ ప్రాశస్త్యాన్ని సమర్థనీయంగా చెప్పారు. కొందరు నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగ్గడ మున్నగు ప్రాచీన మహాకవుల ఉన్నత శ్రేణికి చెందిన వారన్నారు. కొందరు పెద్దదనంతో పోల్చారు. "వెయ్యేళ్ల సంవత్సరాలకు ఒక మహాకవి పుడతాడు. అందులో ఈయన ఒకరు" అని కొందరు అన్నారు. "నాచన సోమడు, కృష్ణరాయలు, రామకృష్ణ కవులను ముగ్గురిని కాచి మథించితే వీర్వడినవారే విశ్వనాథ సత్యనారాయణగారు" అని కాటూరి వెంకటేశ్వరరావుగారు అన్నారు.

గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టరు గుళ్లపల్లి శ్రీదేవి, కుమారి మల్లాది వసుంధరగార్లు ఉపన్యాసకులుగా వుండడం ఈ సభలో మరొక విశేషం. శ్రీదేవిగారు కవి సమ్రాట్ "వేయిపడగ"లను సమీక్షించారు. కె. వి. రావుకోటిశాస్త్రిగారు విశ్వనాథ వారిని ప్రాచీన మహాకవులతో పోల్చారు. జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు విశ్వనాథవారి సాహిత్యాన్ని దేవతల సంభాషణలో చిత్రించారు.

దాశరథిగారు తన "మహాబోధి" నుండి పద్యాలు చదివారు. అప్పుడు విశ్వనాథ వారు లేచి "కవి అహంభావికనుక నేను కొన్ని వాడి మనుకొంటూ దాశరథి నాయుతిటివాడు కావాలని దీవిస్తున్నాను" అన్నారు. నారాయణరెడ్డిగారు తన "మహాప్రస్థానం" నుండి పద్యాలు, విశ్వనాథవారిపై రచించిన పద్యాలు కడు గ్రాంథ్యంగా గానం చేశారు. అప్పుడు సభాధ్యక్షులు తుమ్మల సీతారామమూర్తిగారు లేచి, "ఆహా! ఏమి నారాయణరెడ్డిగారండీ! ఇటువంటి మహాకవులు ఇరవయ్యో శతాబ్దంలో వున్నారు. వారికి మనం సమకాలికులమై వున్నాం. ఏం అదృష్టమండీ!!" అన్నారు. విశ్వనాథవారు "నేను ఇన్నాళ్ళుగా ఇన్ని గ్రంథాలు వ్రాసి కీర్తి సంపాదిస్తే, ఈ పిన్న పెద్ద లిద్దరూ (దాశరథి, నారాయణరెడ్డిగార్లు) ఇప్పుడే అంతకీర్తిని సంపాదించారు" అన్నారు.

ఈ ఉత్సవాల సందర్భంలోనే పట్టణ రసయితల సంఘానికికూడా ప్రారంభోత్సవం జరిగింది. కె. వి. రామకోటిశాస్త్రిగారు సభకు అధ్యక్షత వహించారు. దాశరథి, నారాయణరెడ్డిగార్లు ప్రారంభోపన్యాసాలు చేశారు. సంఘాన్ని అభివృద్ధి చేయడానికి కొన్ని సూచనలిచ్చారు. విశ్వనాథవారు సంఘాన్ని ఆశీర్వదిస్తూ ఉపన్యసించారు.

రాత్రికి సభాంతంలో సన్మాన సంఘంవారు కవిసమ్రాట్‌కు వెయ్యి న్నూటపదహార్లు బహూకరించారు. ఖర్చులుపోగా ఇంకా మిగిలే వెయ్యి రూపాయలతో సన్మానసభ విశేషాలను, ప్రసంగాలను ఒక సంచిక రూపంలో ముద్రించి దాతలకు ఇవ్వాలనుకొంటున్నామని సన్మాన సంఘాధ్యక్షులు చెప్పారు.

సన్మానానికి కవిసమ్రాట్ సమాధాన మిస్తూ ఇలా అన్నారు: "ఒక వెయ్యి న్నూటపదహార్లేమిటి? షష్టిపూర్తికనుక అరవై వేలైనా ఇవ్వాలి. లేదా అరవై వందలైనా ఇవ్వాలి. లేకుంటే అరవై పదులైనా ఇవ్వాలి. లేకపోతే ఒక్క అరవై రూపాయలైనా ఇవ్వాలి. మీ సన్మానం ఏ లెక్కలోకీ రావడంలేదు! కాబట్టి నేను దీనిలో అరవై రూపాయలుమాత్రం తీసుకొంటున్నాను. మిగతా డబ్బు మీదబడ్డే ఆదాయంతో ప్రతి సంవత్సరం గుడివాడ కళాశాలలో పార్టు 2 లో ఉత్తమ తెలుగు విద్యార్థికి ఒక బహుమతి ఇవ్వండి."

రాజమండ్రి శానిటరీ సిబ్బంది కోర్కెలు
యూనియన్ మెమొరాండంపై ప్రభుత్వ ఉత్తరువు

రాజమండ్రి, జనవరి 15

రాజమండ్రి మునిసిపల్ శానిటరీ సిబ్బంది కనీసకోర్కెలకు గురించి యూనియన్ పంపిన మెమొరాండంపై ప్రభుత్వం ఒక ఉత్తరువు చేసింది. అందులో ఇలావుంది:

సబ్‌డివిజన్‌లో పనిచేసే కార్మికుల జాబితాను, దానికి సంబంధించిన శానిటరీ ఇన్‌స్పెక్టరు తియారు చేయాలి, లేదా హెల్తు ఆఫీసరు మొత్తం జాబితాను తయారుచేసి, దానిననుసరించి కొత్తపనులు వచ్చినప్పుడు ఇవ్వాలి. పనివారల సెలవుచీట్లను ముందుగా పంపాలనే విషయంలో చర్యచేయకలసిన అగత్యం కనపడటంలేదు. ఇంద్ల అద్దె అలవెన్సు జీ. ఓ. నంబరు 1083, 25-3-'53 ను అనుసరించి శానిటరీ సిబ్బందికి అమలుజరగాలి. మునిసిపాల్టీలోని కొన్ని ఖాళీలను భర్తీ చేయడంలో సీనియారిటీని పాటించకుండా పౌరుషూరివారికి పనులుకల్పించారనే ఆరోపణ నిజంకాదు.

ప్రధాన విషయాలు ప్రభుత్వ ఉద్యోగస్థులద్వారా పరిష్కరించబడిన పని యూనియన్ అధ్యక్షుడు శ్రీ డి. ఎస్. బాలాజీదాస్ గారు అన్నారు. మునిసిపల్ కౌన్సిల్‌వారి కృషిద్వారా ఇంద్ల అద్దె అలవెన్సులను 1954 ఏప్రిల్ నుండి 1955 ఆఖరువరకు పొందగల్గారని తెలియజేశారు. అయినా ఖాళీస్థానాలు వచ్చినప్పుడు పక్షపాతంతో అయిదు నుండి పదిహేను సంవత్సరాల వరకు బదిలీ పనిలోవున్న సిబ్బందిని గమనించకుండా పౌరుషూరివారికి, ఏమీ అనుభవం లేనివారికి పనులు కల్పించారని, నేటికీ కల్పిస్తున్నారని, ఇటీవలనే 28 మంది కొత్త సిబ్బందిలో ఇలాంటి నైపుణ్య అవలంబించారని చెప్పాము.

మార్కెటింగ్ సౌకర్యాల అభివృద్ధి
గిడ్డంగి సంస్థ స్థాపనకు ఆంధ్రప్రభుత్వ నిర్ణయం

కర్నూలు, జనవరి 14

మార్కెటింగ్ సౌకర్యాలను అభివృద్ధి చేయడానికిగాను, వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఒక గిడ్డంగి సంస్థను స్థాపించాలని, ఆంధ్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

ఈ సంస్థకు అనుమతించబడిన మూలధనం రెండుకోట్లుంటుంది. అందులో 50 లక్షలు వెచ్చించే మూలధనంగా వుంటుంది. 1956-57 బడ్జెట్‌లో ఇందుకుగాను 15 లక్షలు కేటాయిస్తాము.

రాష్ట్రంలో స్థాపించే ఈ గిడ్డంగి సంస్థ ఖర్చులో సగం కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

ఈ సంస్థ ఏర్పడిన తర్వాత, రైతులు తమ పంటలను అక్కడ నాకట్టు పెట్టవలసివుంటుంది. అందుకు వారికి కనీసం లిస్తాము. వీటి నాధారం చేసుకొని రైతులు రుణాలు సంపాదించుకోవచ్చు.

ప్రస్తుతం వివిధ జిల్లాల్లోనున్న కోఆపరేటివ్ హోల్‌సేల్ స్టోర్సును మార్కెటింగ్ సొసైటీలుగా మార్చాలనికూడా ప్రభుత్వం సంకల్పించింది. నెల్లూరు, విజయనగరంలలో స్టోర్సు ఈ మధ్యనే అలా మార్చబడ్డాయి.

యువజనుల సంక్రాంతి వేడుకలు: పలుతావుల్లో ఆటలపోటీలు వినోద కార్యక్రమాలు

ఊటుకూరు, జనవరి 16

గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా యువజన సంఘం ఆటల పోటీలు యీ నెల 13,14 తేదీలలో ఊటుకూరు గ్రామంలో జయప్రదంగా జరిగాయి. చెడుగుడు, బ్యాడ్‌మింటన్, వాలీబాల్, పరుగు, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలలో పలువురు పాల్గొన్నారు.

చెడుగుడు ఆటలో అచ్చమ్మపేట టీము విన్నర్సుగాను, ఊటుకూరు "ఎ" టీము రన్నర్సుగాను వచ్చారు.

బ్యాడ్‌మింటన్ ఆటలో ఊటుకూరు గ్రామ "ఎ" టీము విన్నర్సుగాను, అచ్చమ్మపేట "బి" టీము రన్నరుగాను, వచ్చారు. వాలీబాల్ ఆటలో కోనూరు "బి" టీము వారు విన్నర్సుగాను, "ఎ" టీము వారు రన్నర్సుగాను వచ్చారు.

పరుగు పందెంలో శ్రీ సి. హెచ్. సుబ్బారెడ్డిగారు; లాంగ్ జంప్‌లో శ్రీ బి. హెచ్. రామిరెడ్డిగారు హైజంప్‌లో శ్రీ కె. త్రివిక్రమరావుగారు గెలుపొందారు.

అనంతరం జరిగిన బహిరంగసభలో యువజనుల శారీరక అభివృద్ధికి వ్యాయామం శ్రేయస్సులో పాల్గొనవలసిన అవసరాన్ని గురించి వక్తలు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు బహూకరించారు.

పర్చూరుగ్రామ యువకుల ఉత్సాహం

గుంటూరు జిల్లా పర్చూరు గ్రామ యువకులు సంక్రాంతి పండుగ సందర్భంలో ఆటల పోటీలు, సాంఘిక నాటకము ప్రదర్శించి చేడుకులు పండుకున్నారు. చెడుగుడు ఆటలో పాల్గొని ఫ్రెండ్స్ టీము విజేతలుగా నిలిచారు. శ్రీ నరహరి శెట్టి వెంకటస్వామిగారు పరితోషకాలు బహూకరించారు.

అభ్యుదయ నాట్యకుండలి వారు ప్రదర్శించిన సాంఘిక నాటికను మరాని ప్రజలు ఆనందించారు.

చీరాల బాలల వేడుకలు

గుంటూరుజిల్లా చీరాల శ్రీకరపురి బాలానంద సంఘంవారు సంక్రాంతి ఉత్సవాల సందర్భంలో ఎన్నికల వినోదం జరుపుకున్నారు. "సత్యం", "అహింస", "భక్తి" ఈ మూడింటిలో యేది కావాలో బాలలు ఎన్నుకోవాలి. అందుకుగాను రహస్యఓటింగు యేర్పాటుచేశారు. ఒకరు ప్రిసైడింగు ఆఫీసరుగాను, మరొకరు గుర్తులుపెట్టే అధికారిగాను నియమించబడ్డారు. పెట్టెలు సీల్చివిప్పి ఓట్లు లెక్కిస్తే "భక్తి"కి 19, "సత్యం"కు 18, "అహింసకు" 10 ఓట్లు వచ్చాయి.

అనంతరం బాలల రాణాప్రతాప్ గ్రంథాలయానికి ప్రారంభోత్సవం జరిగింది. బాలసంఘ అధ్యక్షుడు శ్రీ యం. వై. కోటేశ్వరరావుగారు వేడుకలలో పాల్గొన్న బాలబాలికలకు పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

అమలాపురం తాలూకా యువజనుల క్రీడోత్సవాలు

తూర్పుగోదావరిజిల్లా అమలాపురం తాలూకా యువజన సంఘం యాజమాన్యాన యీ నెల 15వ తేదీన దెయ్యేరు గ్రామంలో ఆటల పోటీలు జరిగాయి. తాలూకాలోని ముఖ్య కేంద్రాలనుండి వచ్చిన 500 మంది యువకులు ఉత్సవంలో పాల్గొన్నారు.

బ్యాడ్‌మింటన్, వాలీబాల్, సైకిల్ రేస్, చెడుగుడు, లాంగ్ జంప్, హైజెంప్ పోటీలు జరిగాయి.

పోటీలలో గెలుపొందిన వారికి తాలూకా యువజన సంఘం తరఫున శ్రీ మంతెన నరసింహమూర్తిగారు బహుమతులు పంచారు. వివిధ గ్రామాలనుండి - వచ్చి పోటీలలో పాల్గొన్న టీములకు, యువజనులకు తాలూకా యువజన సంఘం తరఫున శ్రీ రెడ్డి కొండలరావుగారు అభినందనలు తెలియజేశారు.

శేఖుసానుపల్లె యువజనుల సంక్రాంతి వేడుకలు

అనంతపురంజిల్లా ఉరవకొండ సబ్‌తాలూకా శేఖుసానుపల్లె యువకులు, విద్యార్థులు శ్రీ కె. ఓ. హనుమంతయ్యగారి నాయకత్వాన హరిజనవాడకు వెళ్ళి అక్కడి వీధులను సుంచి నీటి బావిని పరిశుభ్రం చేసారు. వాడలోని హరిజనులను సమావేశపరచి పరిశుభ్రంగా ఉండవలసిన ఆవశ్యకతను, విధానాలను వివరించారు.

చవుకగా హైడ్రోజన్ బాంబు తయారు చేసే పద్ధతి
రష్యా శాస్త్రవేత్తలు కనిపెట్టారని క్రుశ్చేవ్

లండన్, జనవరి 17

హైడ్రోజన్ బాంబులను చవుకగా తయారుచేసే పద్ధతిని సోవియట్ శాస్త్రవేత్తలు కనిపెట్టారని సోవియట్ కమ్యూనిస్టుపార్టి ప్రధాన కార్యదర్శి నికిటాక్రుశ్చేవ్, తెలిపారని బ్రిటిష్ పార్లమెంటు లేబరుపార్టీప్రముఖుడు హెరాల్డ్ విల్సన్ "డెయిలీ మిర్రర్"లో ఒక ప్రత్యేక వ్యాసం రాస్తూ పేర్కొన్నారు.

హెరాల్డ్ విల్సన్ ఇటీవలనే సోవియటులో పర్యటించి, సోవియట్ నాయకులతో ఇంటర్వ్యూ జరిపి వచ్చారు.

ఖమ్మం జిల్లాలో భూసంస్కరణలు
తెలంగాణా ప్రజల త్యాగఫలితమేనని ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు నాయకులనివరణ

మధిర, జనవరి 16

తెలంగాణా ప్రజలు కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రమహాసభల నాయకత్వాన జరిపిన పోరాటం, ఆ తర్వాత గత మూడేళ్ళుగా రైతుసంఘాల ఆధ్వర్యాన చేసిన ఆందోళనల ఫలితంగానే హైదరాబాదు ప్రభుత్వం నానుమార్జినైన వ్యవసాయ సంస్కరణల పైపు అయినా దృష్టి సారించక తప్పలేదని ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ నల్లమలగిరి ప్రసాద్‌గారు మల్లాపాడులో మూడు నేల మందితో నాలుగురోజుల క్రితం జరిగిన బహిరంగసభలో స్పష్టంచేశారు.

ప్రభుత్వం, ముందుగానే సంస్కరణలు తేబోతున్నామనిభూస్వాములను నిద్రలేపింది. భూస్వాములుగరిష్ట పరిమితికిమించి ఉన్నభూమినితమభార్యాపిల్లల పేర, దగ్గర బంధువులపేర పెట్టేసుకొన్నారు. పెద్ద ఎత్తున బేదఖళ్ళు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. తిత్సలితంగా భూసంస్కరణలు కరిమంగిన వెలగపండులా తయారయాయి. నేటికీ అయిదునేల మందికి పైగా కౌలుదారు ఖమ్మం, కొత్తిపూడెం డివిజన్లలో కలక్టర్లవద్ద తమకు జరిగిన అన్యాయాన్ని విజ్ఞప్తుల ద్వారా తెలుపుకున్నారు.

సకళ్ళులేవనో, సర్వేలుంగులేదనో, రసీదులు లేవనో-ఇత్యాది చెక్కిలి కారణాలను చూపి కౌలుదారులకు అన్యాయం చేయకుండా ఆ యా గ్రామాలకు వెళ్ళి బహిరంగ విచారణలు జరిపి, సాగుదారులకు భూమిదక్కేలా చూడాలని శ్రీ ప్రసాద్ ప్రభుత్వోద్యోగులను కోరారు.

తనది కాని భూమిని "దానం" చేస్తున్న కొందరు పెద్దలను పేరుపేరు వరసనా శ్రీ ప్రసాద్ తమ ఉపన్యాసంలో పేర్కొంటూ "దాతల్ల హృదయాల్లో వచ్చిన "పరివర్తన"ను గురించి సోదాహరణగా వివరించారు. తమ హక్కు భుక్తంలోనున్న భూమిని దానంచేసిన వారిని అభినందించారు.

మధిరతాలూకా రైతుసంఘ ఉపాధ్యక్షులు శ్రీ కట్టికొండ జానయ్య అధ్యక్షత ప్రసంగించారు. తాలూకా రైతుసంఘ సహాయ కార్యదర్శి శ్రీనూకారపుల బానకిరామయ్యగారు సత్వర విశాలాంధ్ర స్థాపనకు కేంద్ర ప్రభుత్వం తటపటాయించటం మూలాన ప్రజల్లో అనేక అనుమానాలను సృష్టిస్తున్నదన్నారు. ఆ తర్వాత సత్వర విశాలాంధ్ర ను కోరుతూ తీర్మానించుడింది.

అనంతరం స్థానిక లగడపాటి గోపయ్య నాట్యమండలివారు 'ముందడుగు' నాటికాన్ని ప్రదర్శించారు. (వి. వి.)

ఎస్. కె. పాటిల్ పన్నాగాలు
ప. గోదావరిజిల్లా కాంగ్రెసు నాయకుల నిరసన

భీమవరం, జనవరి 14

ఆంధ్ర రాష్ట్రంలో అనవసరంగా సుమారు మూడు సంవత్సరాలు కాలం వెళ్ళబుచ్చి విశాలాంధ్ర సమస్యపై సంధాన కర్తగా వ్యవహరించి బూమరాంగ్ అయిన ఎస్. కె. పాటిల్ నిర్వాణ ఖండిస్తూ ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ సభ్యులు శ్రీ కె. వెంకటనరసింహరాజు, ప. గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ సంయుక్త కార్యదర్శి శ్రీ పి. వెంకటపతిరాజు, భీమవరం తాలూకా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ డి. వెంకటరత్నం, పట్టణ కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ ఎ. వీరాస్వామిరాజులగార్లు సోమవారం ప్రకటన చేశారు.

ఈయన 'ఎన్కౌంటరు' ప్రసంగంకన్నా చక్కటి తెచ్చిపెట్టుకోవలసిన, అంతేకాక విశాలాంధ్ర సమస్యపై సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకోవటాన్ని నిరసిస్తూ విశాలాంధ్ర కృషి చేయాలని ప్రజలను అర్థించారు.

సభలు-సమావేశాలు

రాజమండ్రి పట్టణ కమ్యూనిస్టు మహాసభ యీ నెల 19,20,21 తేదీలలో జరుగుతుందని కమిటీ కార్యదర్శి తెలియజేస్తున్నారు.

తెమ్మిలు
ఆంధ్రపత్రిక అసత్య వార్త

సహనశీలురు!

కృష్ణాజిల్లా జమీందార్లేపల్లి గ్రామములో శ్రీ పొట్లూరు సీతారామయ్య వద్దకు ఇరవైమంది ప్రముఖ కమ్యూనిస్టులు కమ్యూనిస్టుపార్టికి రాజీనామా ఇచ్చినట్లుగా 18-1-56 ఆంధ్రపత్రికలో ఒకవార్త ప్రచురింపబడింది.

ఈ గ్రామములో ఎవ్వరున్నూ కమ్యూనిస్టుపార్టికి రాజీనామా ఇచ్చి వుండలేదు. అయినా యీవార్త అసత్యమను ఆంధ్రపత్రికకు ఎవరు పంపారో, పత్రికాధిపతులు ఎందుకు ప్రచురించారో అర్థంజేసుకోలేక పోతున్నాము.

ఇక్కడ నేనుగాని, తెదితరులుగాని కమ్యూనిస్టు పార్టికి రాజీనామా ఇవ్వలేదు. ఆంధ్రపత్రికలో ప్రచురింపబడినవార్త అసత్యమైనదని తెలియజేస్తున్నాను.

పొట్లూరు సీతారామయ్య,
జమీందార్లేపల్లి
కృష్ణాజిల్లా.

మనదేశంలో ఎఫ్రాన్ బర్గ్ కార్యక్రమం

న్యూఢిల్లీ, జనవరి 16

ప్రఖ్యాత సోవియట్ రచయిత ఇల్యా ఎఫ్రాన్‌బర్గ్, రేపు సాయంత్రం ఢిల్లీ చేరుతున్నారు. ఆయన తన దేశంలో ఒక నెలపాటు పర్యటిస్తారు. రిపబ్లిక్ దినోత్సవం వరకూ ఢిల్లీలోనే వుంటారు.

ఆయన ఇక్కడ చారిత్రక స్థలాలను సందర్శిస్తారు. భక్రా నంగల్ బ్రాంచెస్‌ను, ఆగ్రానుకూడాచూస్తారు. ఢిల్లీలో అఖిలభారత శాంతి సమితి ఆధ్వర్యాన బహిరంగ సభలో ఉపన్యసిస్తారు. పత్రికా గోష్ఠి నిర్వహిస్తారు. భారత సోవియట్ సాంస్కృతిక సంఘంవారు ఆయనకు తేనీటి విందు చేస్తారు.

ఢిల్లీలో ఎఫ్రాన్‌బర్గ్ ప్రధాన మంత్రిని, ప్రముఖ భారతీయ రచయితలను, కళాకారులను, కలుసుకోవచ్చు. ఆ తర్వాత బొంబాయి, కలకత్తా, మద్రాసు మున్నగునగరాలు సందర్శిస్తారు. (వి. వి.)

కృష్ణాజిల్లా దివితాలూకా నాగాయలంకలోని నెగ్గిన నంబరు సహకార పరపతి సంఘానికి శ్రీయుతులు ఉప్పల నల్లయ్య (అధ్యక్షుడు) సబ్బినేని సీతారామయ్య (కార్యదర్శి) గార్లు ఎన్నుకోబడ్డారు.

బజారుధరలు

విజయవాడ, జనవరి 18
(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పాట్లా	96	0 0
మూసా	95	0 0
నవరసు	63	0 0
వెండి 100 తులములు	178	0 0
1 తులము	1	13 0

ధాన్యం ధరలు

	పాతవి		కొత్తవి	
24 సెంబరు	24	0 0	19	0 0
వంకసన్నాలు	20	12 0	17	8 0
12 సెంబరు	19	8 0	16	12 0
అక్కుళ్ళు	19	8 0	16	12 0
కుసుమ	19	4 0	16	12 0
కొణామణి	19	4 0	16	12 0

బియ్యం ధరలు

	పాతవి		కొత్తవి	
24 సెంబరు	55	8 0		
వంకసన్నాలు	47	0 0		
12 సెంబరు	43	12 0	38	0 0
అక్కుళ్ళు	43	12 0	38	0 0
కుసుమ	43	0 0	38	8 0
కొణామణి	43	0 0		

అపరాల ధరలు

మినుములు 240 పౌనులు			47	8 0
కందులు			33	10 0
నల్లపెసలు (మాగాణి)	41/-		45	0 0
పచ్చపెసలు			43	8 0
పచ్చపెసలు (మెట్టవి)	27/-		40	8 0
పెసగలు (పంజాబు)			28	8 0
ధనియాలు 90 పౌనులు			32	0 0
ఉలవలు			28	0 0
ఆముదాలు			30	0 0
పండదార (ఉయ్యూరు)			82	4 0
బెల్లం మణుగు	3/-		3	10 0
మిర్చి ,,	19/-		21	0 0
నీరుల్లి ,,	2	2 0	3	2 0
వెల్లుల్లి ,,			4	8 0
చింతపండు	4	8 0	5	0 0
కొబ్బరినూనె డబ్బా			24	8 0
వేరు సెనగపప్పు 177 పౌ॥			47	0 0
,, నూనె మణుగు			12	12 0
,, కేక్ 160 పౌ॥			11	10 0
,, మడ్డిపిండి 160 పౌ॥			15	0 0
కొబ్బరికాయలు 1,000 కొత్త			153	136
పసుపుపుట్టి			255	0 0
సంచులు 100			112	8 0

మోదుమూడి

కృష్ణాజిల్లా దివితాలూకా మోదుమూడి గ్రామ సోషలిస్టుపార్టీ యీ నెల 15 న సమావేశమై ఆంధ్రప్రభుత్వం తలపెట్టిన అదనపుపన్నుల విధానాన్ని నిరసిస్తూ తీర్మానించింది. బంజర్లు పేదలకు ఉచితంగా పంచాలని డిమాండ్ చేసింది.

రేడియో

జనవరి 20, శుక్ర॥

విజయవాడ: (357.1 మీటర్లలో) ఉదయం:
6-50 స్వాగతము;
6-55 ప్రసారవిశేషాలు;
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
8-0 (ఆం. వా.);
12-30 మ॥ విద్యార్థులకు;
1-0 మద్రాసువలె;
1-30 గీతావళి;
1-40 హిందీలోవార్తలు
1-50 (తె. వా.);
2-15 ఉ॥ విద్యార్థులకు;
4-0 ప్రా॥ విద్యార్థులకు;
5-30 నాదస్వరం;
6-0 సంగీత శిక్షణ;
6-15 (ప్రాం. వా.);
6-25 స్థానిక ప్రకటనలు;
6-30 గ్రామస్థులకు;
7-0 (తె. వా.);
7-15 రంగులరాట్నం;
9-0 (ఆం. వా.);
9-15 విమర్శన (ప్రసంగం);
9-30 గీతసంధి;
9-50 వాద్యసంగీతం;
10-0 సమాప్తి.

మద్రాసు బి. (211.3 మీటర్లలో) ఉదయం:
6-50 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
8-0 (ఆం. వా.);
12-0 కార్మికులకు;
12-30 మ॥ విద్యార్థులకు;
1-0 గీతమాలిక;
1-30 (ఆం. వా.);
1-40 గానమంజరి;
1-50 (తె. వా.);
2-15 ఉ॥ విద్యార్థులకు;
4-0 ప్రా॥ విద్యార్థులకు;
5-30 సంకీర్తనం;
6-0 (ఆం. వా.);
6-15 (ప్రా. వా.);
6-30 గ్రామస్థులకు;
7-0 (తె. వా.);
7-15 రంగులరాట్నం;
9-0 (ఆం. వా.);
9-30 లలితసంగీతం;
10-30 సమాప్తి.

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయం:
6-50 సుప్రభాత్;
6-55 కార్యక్రమవివరణ
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
7-45 (క. వా.);
8-0 (ఆ. వా.);
8-15 (హిం. వా.);
8-45 కవాలీ;
12-30 రాగాలీ;
12-50 (తు. వా.);
1-0 మహిళాసమాజం;
1-45 నాదస్వరం;
1-50 (తె. వా.);
3-45 పాఠశాలలకు;
5-30 కవాలీ;
6-0 మ॥ కార్యక్రమం;
6-30 వాద్యఝంకార్;
6-40 స్థానిక ప్రకటనలు;
6-45 గీతావళి;
7-0 (తె. వా.);
7-45 వీణ;
9-0 (ఆం. వా.);
9-15 (ఉ. వా.);
10-0 ఖయాల్ హుల్లోశ్;
10-30 సమాప్తి.

ధారత్ ట్రాన్సపోర్ట్స్ లి., మౌంట్‌రోడ్, (రి. నం. 1866) మద్రాస్ - 2.
180 ఎకరాల అప్రూడిషియల్ రిజల్టు: 111122111211112
అప్రెంటిస్ కమిటీ: (1) శ్రీ మద్దు సుబ్బారావు, కాలేజికమిటీ, పరాల, (2) శ్రీ యస్. కె. దేవరాజు, బి. ఎ., కె. జి. యఫ్. సైన్సుకాలు, రాబర్ట్సన్‌పేట, (3) శ్రీ ఎ. ఇందిర, మెట్రుపాలీయం, (4) శ్రీటి.యం.రామనాథన్, క్లర్కు, ఆర్.ఎ.ఒ.ఆఫీసు ట్రిచ్చి. (జం), (5) శ్రీ టి. యస్. రాజగోపాలన్, ప్రింటర్, మద్రాస్-17.
178 ఎకర బహుమతులు: 1 వది 20 మందికి రు. 250/- చొప్పున 2 వది 612 మందికి రు. 2-4-0 చొప్పున; 3 వది 2138 మందికి రు. 0-12-0 చొప్పున; 4 వది 7186 మందికి రు. 0-6-0 చొప్పున.
ప్రతిచోట డిపో ఏజెంట్లు, కలెక్టర్లు కావలెను.

పొగాకుపంటకు నిలయమైన చిలకలూరిపేటలో సిగరెట్ ఫ్యాక్టరీ

స్థాపించాలని పట్టణ కమ్యూనిస్టు కమిటీ అభ్యర్థన

చిలకలూరిపేట, జనవరి 15

ఆంధ్ర గవర్నరు శ్రీ త్రివేదిగారు ఈ నెల 11వ తేదీన గుంటూరు వచ్చిన సందర్భంలో చిలకలూరిపేట పట్టణ కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ అంబటి ఆంజనేయులు గారు వారిని కలుసుకొని ఒక మెమొరాండం సమర్పించారు.

ఆ మెమొరాండంలో క్రింది వివరాలు పేర్కొన్నారు.

చిలకలూరిపేట 20 వేల జనాభా గల చిన్నపట్టణం. గ్రాండ్ ట్రంక్ రోడ్డు ఈ పూరిమీదుగా వెళ్లుటచే ప్రముఖ పట్టణంగావుంది. తూర్పున చీరాల పట్టణాన్ని, పడమర నరసరావుపేట మీదుగా మాచెర్ల పట్టణాన్ని, కలుపు కూడలిగా వుండి వ్యాపార, ప్రయాణ సౌకర్యాలను కలిగిస్తుంది. యీ పట్టణ పరిసర ప్రాంతాలలో నాణ్యమైనవకు, మన్నికకు ప్రఖ్యాతిగాంచిన పుగాకు అత్యధికంగా పుట్టిస్తికాకడం వలన వి. యల్. టి. డి., నేషనల్ టుబాకో; బి. ఐ. టి., ఇత్యాది భారీ వ్యాపార సంస్థలకు, అనేక చిన్న వ్యాపారసంస్థలకునిలయమైంది. తిత్సలితంగా సుమారు 10 వేలమంది కార్మికులకు జీవనభృతి కలిగిస్తుంది. ఈపుగాకుపంట సీజన్ అగుటనే నాలుగుమాసములు మాత్రమే పనికలిగి మిగతా

బొంబాయి నగరంలో 8 చోట్ల కాల్పులు

4గురు మాత్రం గాయపడ్డారని పోలీసుప్రకటన

బొంబాయి, జనవరి 17

నేడు బొంబాయి నగరంలో ప్రదర్శనలు చేస్తున్న ప్రజలను చెదరగొట్టేందుకై పోలీసులు ఎనిమిదిమార్లు కాల్పులు కాల్చారు. దీనిలో నలుగురు గాయపడ్డారని తెలుస్తూంది.

ఈ రోజున ప్రదర్శకులు పోలీసులమీద రాళ్ళు విసరడంమూలంగా ఒక పోలీసు కానిస్టేబులూ, మరియిద్దరు గురు గాయపడ్డారు.

నిన్న రాత్రి ప్రధాని నెహ్రూ రేడియో ఉపన్యాసం అయ్యాక శాకుర్ ద్వార్‌లో పెద్ద గలాటా జరిగింది. పోలీసులు కాల్చడం ఫలితంగా ఎనిమిదిమంది గాయపడ్డారు. వారిలో ఒకరు రాత్రే హాస్పిటలులో మరణించారు.

ఉదయం వేళకు శాకుర్ ద్వార్ ప్రశాంతంగానే వుంది. కాని మధ్యాహ్నానికి బస్సులూ, ట్రాములూ తగులబెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

పోలీసులు చాలమార్లు ప్రదర్శకుల మీద జెత్తాల నుపయోగించారు. ఇంక చెదరగొట్టడం సాధ్యంగాక తుపాకులు కాల్చారు.

బొంబాయి మధ్య భాగంలోని లైకుల్లా, అగ్రపదాలలోనూ, ఉత్తర భాగంలోని చించ్‌పోక్లీలోను ప్రదర్శకులు పోలీసులను రాళ్ళతో ఎదుర్కొనడంతో పోలీసులు కాల్పులు ప్రారంభించారు. లైకుల్లాలో ప్రదర్శకులు ఒక మునిసిపల్ లారీని తగులబెట్టారు. ఒక భవనంలో తగులబడుతున్న కిరోసిన్ గుండ్లను విసిరారు. అప్పుడు డిప్యూటీ కమిషనర్ నాయకత్వాన పోలీసు దళం వచ్చి కాల్పులు జరిపింది.

చించ్‌పోక్లీలో ప్రదర్శకులు ఇళ్ల మీద దాడి చేశారనీ, అగ్రపదలో పోలీసులపై రాళ్ళ వేశారనీ కాల్పులు జరిపినట్లు తెలుస్తూంది.

ఘాట్లు ప్రాంతంలోని ఒక కాలేజీ వద్ద విద్యార్థులమీద పోలీసులు లాఠీ చార్జీ చేశారు. శాకుద్వార్ ప్రాంతంలోని మంగల్వాడలో ప్రదర్శకులపై భాష్పవాయువుపయోగించారు.

సాయంకాలం 8 గంటలవేళ వరకు నేడు 106 మంది అరెస్టుచేయబడ్డారు. వీరితో ఈ రెండు రోజుల్లో మొత్తం 641 మంది అరెస్టయ్యారు.

ఈరోజున పోలీసులు మొత్తం 14 తోటాలు కాల్చినట్లు చెప్తున్నారు.

నేడు రెండు రైల్వే వర్క్‌షాపులూ, 21 రోళ్ళ మిల్లులూ మూయబడేవున్నాయి. మిగిలినవానిలోకూడా కార్మికులంతా హాజరుకాలేదు.

దాదర్, శివాజీ పార్కు-లలో భవనాలమీద పల్లజెండాలు ఎగరవేయబడ్డాయి.

దాదర్, శివాజీ పార్కు, గిర్గాం, శాకుద్వార్‌లలో పాపులు చాలవరకు మూయబడ్డాయి.

నిన్నరాత్రి శాకుద్వార్‌లో జరిగిన కాల్పుల ఫలితంగా మరణించినవాని శవాన్ని పూడ్చేందుకు పోలీసులు అనుమతించలేదు. హాస్పిటల్ నుంచి సరాసరి స్మశానానికి పోలీసువాన్‌లో తీసు కెళ్ళి బంధువులకు కప్పజెప్పారు.

నగరంలో రైళ్ల రాకపోకలు యథాక్రమంగానే సాగాయి. కాని మునిసిపాలిటీ నడుపుతున్న బస్‌లు సంభయి వంతులు నిలిచిపోయాయి. నడుస్తున్న వానికి కూడా రాళ్ళనుంచి రక్షణకోసం ఉక్కు చిక్కాలు తగిలించారు.

లేవులోపనిమామూలుగనే జరిగింది.

దాదర్ ప్రాంతంలో ఒక యింటి వైభాగం నుంచి పోలీసులమీద రాళ్లు కురుస్తుంటే భవనాన్ని పోలీసులు సోదాచేసి అయిదు గురిని అరెస్టు చేశారు.

బొంబాయి అరెస్టులపై వివిధ పార్టీలవారి ఖండన

బొంబాయి, జనవరి 16

సంయుక్త మహారాష్ట్ర ఉద్యమ నాయకుల అరెస్టులనుగండిస్తూ వివిధ పార్టీల నాయకులు ప్రకటనలు చేశారు.

సోషలిస్టుపార్టీ సంయుక్త కార్యదర్శి శ్రీ ఎస్. ఎం. జోషీ మాట్లాడుతూ, కార్మిక నాయకులను అరెస్టు చేయడానికి డిటెన్షన్ చట్టం ఉపయోగించడం అసహ్యకరమన్నారు. నాయకులు అశ్వాసంతో ప్రజలే నాయకత్వంకలిగించి తమలక్ష్యం సిద్ధించేవరకు పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

సంప్రదింపుల వల్ల సమస్య పరిష్కారమైందని నాయకుల అరెస్టు తెలుపుతోందని, బొంబాయి ప్రజా సోషలిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ యం. ఆర్. దండవతే అన్నారు. ఇక శాంతియుత పోరాటంద్వారానే లక్ష్యం సిద్ధించగలదన్నారు.

మాజీఉపప్రధాని డాక్టర్ నరహరి ఒక ప్రకటన చేస్తూ, బొంబాయి పరిస్థితిపై కాంగ్రెస్ అధ్యక్షుడు కన్వర్ అంతిమ నిర్ణయం తీసుకోకముందే అరెస్టుల పాలించడం తొందరపాటుతో కూడుకున్న చర్య అని అన్నారు. శాంతియుత మార్గాలలో కడదాకా పోరాటం సాగిస్తామన్నారు.

అరెస్టులను ఖండించడానికి నగరంలోని వివిధ ప్రాంతాలలో నేడు సంయుక్త మహారాష్ట్ర పరిషత్ ఆధ్వర్యాన మూడు బహిరంగ సభలు జరిగాయి. కాంగర్ మైదానంలో 50 వేల మందితో జరిగిన సభలో శ్రీ పి.కె.ఆత్రే ప్రసంగిస్తూ, బొంబాయినగరంతో సంయుక్త మహారాష్ట్ర సాధించడానికి, ప్రజలు దృఢ దీక్షతో నిలబడాలన్నారు. ప్రభుత్వం చెప్పకొట్టినా చచ్చిపోక శాంతియుత ప్రజాస్వామ్య ఆందోళన సాగించాలని శ్రీ ఆర్. కె. ఖాడ్లే, ప్రభాకర్ మోరే, శ్రీమతి కె. యస్. జోషీ, ప్రభృతులు విజ్ఞప్తిచేశారు.

బొంబాయి ప్రభుత్వంలో అవిశ్వాసం ప్రకటిస్తూ, మహారాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు రాజీనామా చేయాలని కోరుతూ సభలో తీర్మానం చేశారు.

పోరాటానికి సిద్ధంకండి

మహారాష్ట్రులకు పూనా బహిరంగసభపిలుపు

పూనా, జనవరి 17

బొంబాయి రాజధానిగా సంయుక్త మహారాష్ట్రను సాధించేవరకూ అవిశ్రాంతంగా పోరాడడానికి సిద్ధం కావలసిందని నేడిక్కడ అన్ని రాజకీయ పక్షాల తరఫునా జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో మహారాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చరిత్ర ప్రసిద్ధమైన శనివార వాడాలో ఈ సమావేశం జరిగింది. దీనికి కాంగ్రెసు మేయరు శ్రీ సనస్ అధ్యక్షత వహించారు.

మహారాష్ట్ర ప్రజల ఆశయసిద్ధి కోసం ఎలాంటి పోరాటాన్ని ప్రారంభించినప్పటికీ తమ సంపూర్ణ సహకారం వుండగలదని కమ్యూనిస్టు, సోషలిస్టు, ప్రజాసోషలిస్టు, హిందూ మహాసభ, జనసంఘ నాయకులు ఆ సభలో ప్రకటించారు.

పోరాటానికి తొలిచర్యగా బొంబాయిలోని మహారాష్ట్ర మంత్రులంతా రాజీనామా ఇవ్వాలని సభలంతా సూచించారు.

బొంబాయిని కేంద్ర పాలిత ప్రాంతంచేసినందుకూ ముందుజాగ్రత్త పేరుతో అయిదువందలమంది నాయకులను అరెస్టుచేసి దారుణ నిర్బంధ విధానాన్ని బొంబాయిలో కెలకొల్పినందుకూ ప్రభుత్వ చర్యను ఖండిస్తూ ఒక తీర్మానం చేశారు.

ప్రజలు శాంతియుతంగా, అహింసాత్మకంగా సాగిస్తున్న ఆందోళనను ఈ దారుణ నిర్బంధం ద్వారా అణచిపూనుకొని రెచ్చగొట్టడాన్ని మహారాష్ట్రులెన్నటికీ సహింపబోరని ఆ తీర్మానంలో హెచ్చరించారు. తమ ఆశయసిద్ధికై సుదృఢ పోరాటాన్ని సాగించడానికి సంసిద్ధులు కండని మహారాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బొంబాయి ప్రభుత్వ దారుణ నిర్బంధవిధానాన్ని నిరసిస్తూ మేయరు ప్రసంగించారు.

సంప్రతింపులూ, సమావేశాలూకాలం గడిచిందనీ ఇప్పుడు కార్యాచరణ కాలం వచ్చిందనీ కేసరి పత్రిక సంపాదకులు శ్రీ జయంతరావు తిలక్ అన్నారు.

కాంగ్రెసువారు కలిసివచ్చినా రాకపోయినా ఆందోళన మాత్రం కొనసాగుతుందని వృద్ధ కాంగ్రెసు నాయకుడు శ్రీ జేధే అన్నారు.

కిసాన్ మజ్దూర్ పార్టీ నాయకుడు శ్రీ ఖాడిల్కర్, మహారాష్ట్ర హిందూమహాసభ అధ్యక్షుడు శ్రీ నాల్వాడే, కమ్యూనిస్టు నాయకుడు శ్రీ బి. డి. బితాలే, ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ ప్రభాకర్ కూడా సభలో ప్రసంగించారు.

గుజరాతీ పెట్టుబడిదారులకు దాసోహం

తెలంగాణా కమ్యూనిస్టు కమిటీ ప్రకటన

హైదరాబాద్, జనవరి 17

గుజరాతీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు లొంగి కేంద్ర ప్రభుత్వం బొంబాయి నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేయదలచిందని, తెలుగు నాణా కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గం నేడొక ప్రకటనలో విమర్శించింది.

"ఈనిర్ణయం మిక్కిలి ప్రజాతంత్ర విరుద్ధమైనది. బొంబాయి మహానగర ప్రజలకు ఆ నగర పాలనలో పాత్ర వుండదు. ఈ నిర్ణయంద్వారా మహారాష్ట్రులకు కేంద్రం ఎంతైనా అన్యాయం చేసింది. బొంబాయి నగరం మహారాష్ట్రులకే చెందాలి.

బొంబాయి నగరంలో ప్రజలను రెచ్చగొట్టేట్లు చేసిన అరెస్టులను మేము ఖండిస్తున్నాం. వారందరిని విడుదల చేయాలని కోరుతున్నాం. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, బొంబాయిని సంయుక్త మహారాష్ట్రలో చేర్చాలని మేము కోరుతున్నాం.

బొంబాయిని సంయుక్త మహారాష్ట్రలో చేర్చాలనే ప్రజావాంఛను, అందుకై వారు సాగించే న్యాయసమ్మతమైన పోరాటాన్ని తెలుగు ప్రజలు పూర్తిగా బలపర్చుతున్నారు."

తమిళనాడులో అసంతృప్తి

మధుర కోయంబత్తూర్లలో ప్రదర్శనలు: హర్తాళ్లు

మద్రాసు, జనవరి 17

నూతన రాష్ట్రాలపై కేంద్రంచేసిన నిర్ణయాలకు తమిళనాడులోఅసంతృప్తి రేకెత్తింది.

ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నాడార్, పబ్లిక్ వర్క్స్ మంత్రి శ్రీ సేతుపతి ఈనిర్ణయాలపై వ్యాఖ్యానించ నిరాకరించారు. శ్రీ నాడార్ తేపు జాతీయ అభివృద్ధి కౌన్సిలు సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళుతున్నారు. అక్కడాయన పీరమేడు, దేవికోళం సమస్యలను ప్రస్తావించగలరని కొంటున్నారు.

పీరమేడు, దేవికోళం తాలూకాలనే కాకుండా మెంకోట తాలూకాలో ఒక భాగాన్ని కూడా మలయాళీలకు ఇచ్చినందుకు తమిళ అరసు కజగం నాయకుడు శ్రీ శివజ్ఞాన గ్రామణి తమ తీవ్ర అసంతృప్తిని వెల్లడించారు. న్యాయంకోసం తమిళులు పోరాడితీరుతారని ఆయన ప్రకటించారు.

మధురలో 2000 మంది విద్యార్థుల ప్రదర్శనలు

మధురలోని మూడు కళాశాలల్లోనూ గల విద్యార్థులు రెండు వేలమంది నేడు వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. హైస్కూలు విద్యార్థులు కూడా ఈప్రదర్శనల్లో పాల్గొన్నారు. కొన్ని దుకాణాలను మూయించారు.

తర్వాత వారొక బహిరంగసభ జరిపి పీరమేడు, దేవికోళం మలయాళీలకిచ్చినందుకు కేంద్రప్రభుత్వ చర్యను నిరసిస్తూ తీర్మానం చేశారు.

బొంబాయిలో జనరల్ సమ్మెకు

వామపక్ష నాయకుల పిలుపు

బొంబాయి, జనవరి 17

బొంబాయిని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు జనరల్ సమ్మె చేయాలని వామపక్షాల నాయకులందరూ నేడొక ప్రకటన చేశారు.

శివాజీ పార్కులో జరిగిన ఒక బహిరంగ సభలో కమ్యూనిస్టు, సోషలిస్టు, రిపబ్లికన్ కమ్యూనిస్టు, పెజెంట్స్ కర్క్స్, ముజ్దూర్ కిసాన్ పార్టీల నాయకులు బొంబాయి ప్రజలకు ఈ సమ్మె పిలుపు నిచ్చారు.

ఈ అన్ని పార్టీల ప్రతినిధులతోనూ ఒక కార్యాచరణ సంఘం ఏర్పడింది.

సమ్మెను జయప్రదంచేసి ప్రభుత్వ పనాలను ఎదుర్కొనడానికి తాము సిద్ధమేనన్న విషయాన్ని నిరూపించాలని కక్షలంతా ఉపన్యసించారు.

సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కేశవగోరే ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

పరేల్‌లో సమరానికి సమావేశమైంది. అక్కడ కూడా నాయకులు ఇలాంటి సమ్మెకు విజ్ఞప్తి చేశారు.

కోయంబత్తూరులోని ఆరు కళాశాలలకు చెందిన రెండువేలమంది విద్యార్థులుకూడా నగర వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. కేంద్ర నిర్ణయాలను నిరసిస్తూ తీర్మానం చేశారు.

బెల్గాంలో కాల్పులు: నల్గురి మరణం

మూడు రోజుల వరకూ నగరంలో కర్ఫ్యూ

బెల్గాం, జనవరి 17

నేడు బెల్గాంలో పోలీసుల కాల్పుల ఫలితంగా నలుగురు మరణించారు. ప్రభుత్వం సాయంత్రంనుంచి ఉదయం వరకూ కర్ఫ్యూ విధించింది. సాయంత్రం ఆరునుంచి ఉదయం 7 వరకూ విధించిన ఈ కర్ఫ్యూ మూడురోజుల వరకూ అమలులో వుంటుంది.

బెల్గాం నగరం మహారాష్ట్రంలో అంతర్భాగంగాకాక ఫజులీ కమిషన్ వారు సూచించినట్లు కర్ణాటక ప్రాంతానికి పోతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే సంయుక్త మహారాష్ట్రవాదులు ప్రదర్శనలు ప్రారంభించారు.

పరిస్థితులు చేయిజారి పోతున్నాయనే నెపంతో పోలీసులు రెండు చోట్ల కాల్పులు చేశారు.

నేటి సంఘటనలలో రాళ్లు విసరడంవల్ల ఒక పోలీసు సబిన్‌స్పెక్టరుకు కొద్దిమంది పోలీసులకు గాయాలు తగిలాయని అధికారులు అంటున్నారు. ఒక పోలీసు వ్యానుకీ, బస్సుకీ నిప్పంటించారనీ కొన్ని హోటళ్ళనుదుకాణాలను ధ్వంసం చేశారనీ కూడా చెప్తున్నారు. రోడ్డుమీద చాలాచోట్ల రాళ్లు గుట్టలుగా పేర్చడంవల్ల రాకపోకలు స్తంభించి పోయాయి.

సత్వర నిర్ణయం అవసరం

రాజేశ్వరరావుగారి ప్రకటన

విజయవాడ, జనవరి 17

మహాగుజరాత్ సంయుక్త మహారాష్ట్రలకు కేంద్రం సమ్మతించినందుకు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు నేడు తమ జవాబు ప్రకటించారు.

భాషా రాష్ట్రాలను చిరకాలంగా తాముకోరుకున్నామనీ తమిళ, కన్నడ, మళయాళీ, గుజరాతీ, మహారాష్ట్రులు ఏర్పడినందుకు హర్షిస్తున్నామని ఆయన నేడొక ప్రకటన చేశారు. ఈ రాష్ట్రాలలాగే ఆంధ్ర తెలంగాణాలను కలిపి విశాలాంధ్రను ఏర్పరుస్తూ సత్వరమే నిర్ణయం ప్రకటించాలని ఆయన కేంద్రాన్ని అభ్యర్థించారు.

పూనా, జనవరి 17

పూనా సోషలిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ ఎస్. కె. కేల్కార్ ఒక ప్రకటనచేస్తూ పోస్టు, టెలిగ్రాఫ్, రైల్వే ఇన్‌కంటాక్సు ఆఫీసుల్ని బహిష్కరించాలనీ, రైతులు పన్నుల సత్యాగ్రహం చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

వింధ్యప్రదేశ్ లెఫ్టినెంట్ గవర్నరుగా శ్రీ మొహలికంటి తిరుపతిరావుగారు నేడు బాధ్యతలు స్వీకరించారు.

తుంగభద్ర నీటికై ట్రిబ్యునల్ సూచన

మైసూరు ముఖ్యమంత్రి ప్రకటన

బెంగుళూరు, జనవరి 17

తుంగభద్ర నీటి పంపకం గురించి ఆంధ్ర మైసూరు ప్రభుత్వాల మధ్య నున్న తగాదాను పరిష్కరించేందుకు ట్రిబ్యునల్‌ను నియమించడం మంచిదని నేడు మైసూరు ముఖ్యమంత్రి శ్రీ కె. హనుమంతయ్యగారు సూచించారు.

బళ్ళారిసమస్య గురించి మాట్లాడుతూ ఇక్కడున్న సమస్య నీటి పంపకానికి సంబంధించినదేగాని బళ్ళారి ఎవరికి చెందేదనే కాదనీ, ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో అనుసరిస్తున్న విధానాన్నే ఇందులోకూడా అనుసరించవచ్చునని, అలాగకూడా తగాదా పరిష్కారం కాకుంటే న్యాయవేత్తల ట్రిబ్యునల్‌కు పెట్టాలనీ అన్నారు.

ఆంధ్రనాయకులు రాయలసీమ ప్రజల ప్రయోజనాలను గురించి శ్రద్ధచూపుతున్నారని తాము నెరుగుదుమనీ, తాముకూడా సంకుచితత్వం, చేతికందినది లాక్కోవాలనే దృక్పథంతో పనిచేయడం లేదనీ అన్నారు.

రాష్ట్రపునర్నిర్మాణసంఘంరిపోర్టు వచ్చాక ఉభయప్రభుత్వాలూ కలిసి సమస్యల్ని చర్చించడం జరగలేదనీ, అటువంటి సమావేశం ఏర్పరచవలసిందిగా కాంగ్రెసు అధ్యక్షుని కోరామనీ శ్రీ హనుమంతయ్య అన్నారు.

ప్రజాతంత్ర వుద్యమానికి అరెస్టులు ఒకసవాలు

బొంబాయి నిర్ణయం మీద భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ అజయ ఘోష్ ప్రకటన

(విశాలాంధ్ర విలేఖరి)

న్యూఢిల్లీ, జనవరి 17

"బొంబాయి నగరాన్ని కేంద్ర పాలనలోకి తీసుకొనేటందుకు ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం దానిని 'సి' తరగతి రాష్ట్రంగా తయారు చేస్తూంది. దానితోపాటు ప్రజల్ని రెచ్చగొట్టుతూ సాగించిన అరెస్టులు ప్రజాతంత్ర వుద్యమానికే ఒక సవాలు" — అని నేడు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ అజయకుమార్ ఘోష్ ఒక ప్రకటన చేస్తున్నారు.

స్వదేశంలోకూడా శాంతియుత సహజీవనాన్ని ప్రతిపాదిస్తూ పండిత నెహ్రూ ఇచ్చిన వుపన్యాసాన్ని గుర్తుచేస్తూ శ్రీ అజయఘోష్ ఇలా అన్నారు.

"ప్రభుత్వంచెప్పే ఆదర్శాలను ప్రభుత్వం చేస్తున్న పనులే భగ్నం చేస్తున్నాయి.

"మహారాష్ట్ర ప్రజలూ, బొంబాయి ప్రజలూ ప్రభుత్వ నిర్ణయాలను సోసమూసుకొని సహించి వూరుకోరు. అందుచేత వారిని బెదిరించి లొంగదీయడంకోసం పెద్దఎత్తున అరెస్టులుచేశారు. కాల్పులు సాగించారు. వానిలో ఒకరు మరణించారు. చాలమంది గాయపడ్డారు. దీనితో ప్రజలు భయపడిపోతారని వారి ఆశ. కాని అది పట్టని నిరాశే. ఇన్ని అరెస్టులు జరిగినా బొంబాయిలోనూ, మహారాష్ట్రంలోనూ కొన్ని లక్షలమంది కార్మికులు సమ్మెచేశారు. హర్తాళ్ జరిగింది. ప్రభుత్వం అయినా బొంబాయి మహారాష్ట్రులది కాదని చెప్పలేకపోయింది. బొంబాయి చట్టూ మహారాష్ట్రం వుందనీ, దానిని మహారాష్ట్రంలో భాగమేనని చెప్పవచ్చునని ప్రధాని నెహ్రూయే అన్నారు.

"అయినా ప్రజాతంత్ర సిద్ధాంతాలకు, ప్రజాభిప్రాయానికి తిలాంజలి నిచ్చి, పెద్ద వ్యాపారుల మాటలకు ప్రభుత్వం తల వొగ్గింది. స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన బొంబాయి నగరం సమస్య వచ్చేసరికి ప్రభుత్వం సిద్ధాంతాలను ప్రజాభిప్రాయాన్నీ, న్యాయాన్నీ అన్నింటినీ విడచి పెట్టింది. పెద్దపెట్టుబడి దారుల కోరికమేర బొంబాయి విషయంలో ప్రజాతంత్ర వ్యతిరేక విధానాన్ని అనుసరించింది.

"ప్రజలే అన్యాయాన్ని సహించరు. వారి పోరాటంలో న్యాయం వుంది. అది జయించి తీరుతుంది.

ప్రభుత్వ నిర్ణయంపట్ల కేరళుల హర్షం

తిరువేంద్రం, జనవరి 17

కేరళ రాష్ట్రానికి సంబంధించినంత వరకూ కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయానికి కేరళ కమ్యూనిస్టు కమిటీ ప్రతినిధి ఒకరు హర్షం వెలిబుచ్చారు.

ఐక్యకేరళ సంఘం కార్యదర్శి శ్రీ కె. ఎ. దామోదర మీనన్ తాము కోరిన సంపూర్ణ ఐక్యకేరళి లభించక పోయినప్పటికీ ఇంకా అవసరమైన పనులు చాలా తాముపోరాడుచుకోలేదన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ గోవిందమీనన్ తాను వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

అనువాదకుడు రామశేషనాడు కాంగ్రెసు అధ్యక్షుడు అనంతన్ నాయర్ ప్రకటించారు.

మైసూరు పేరుకు హనుమంతయ్య హర్షం

బెంగుళూరు, జనవరి 17

ఏర్పడబోయే కర్ణాటక రాష్ట్రాన్ని మైసూరు రాష్ట్రం అనిపిలవడాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినందుకు నేడు మైసూరు ముఖ్యమంత్రి శ్రీ కె. హనుమంతయ్య హర్షం వెలిబుచ్చారు.

రాష్ట్ర విద్యామంత్రి శ్రీ రామకృష్ణహెగ్డే ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రకటన చేశారు.

పర్చేరు ప్రాంతంలో కరసాంగాడ్ పనిలో జరిపిన ఘటనలో మరి పోవడంవల్ల నేడు మరణించిన ఆగురు పల్లెలూ, ఒక శ్రీ మరణించారు.

మహారాష్ట్రలో సంలీనానికి ప్రత్యేక విదర్భవాదుల సమ్మతి

నాగపూర్ రాజధాని కాగలదని ఆశాభావం

నాగపూర్, జనవరి 17

మధ్యప్రదేశ్‌లోని ఎనిమిది మహారాష్ట్ర జిల్లాలనూ (విదర్భను) మహారాష్ట్రలో లీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయానికి ప్రత్యేక విదర్భవాదులు తమ ఆమోదాన్ని ప్రకటించారు. కాగా నూతన మహారాష్ట్ర రాజధాని నాగపూర్‌లో నెలకొనేవరకూ మాత్రం విశ్రమించబోమంటున్నారు.

మధ్యప్రదేశ్ ఆర్థిక మంత్రి శ్రీ బ్రిజలాల్ బియానీ నేడొక ప్రకటన చేస్తూ ఇంతటితో ప్రత్యేక విదర్భకోసం తాము జరుపుతున్న పోరాటం ముగిసిందన్నారు. అయితే విదర్భ విషయంలో కేంద్రం చేసిన నిర్ణయం న్యాయమైనదన్న నమ్మకం తమకు లేదనీ కాని క్రమ శిక్షణకు కట్టుబడి దాన్ని ఆమోదిస్తున్నామనీ ఆయన అన్నారు. కొత్త మహారాష్ట్రానికి రాజధానిగా నాగపూర్‌ను మహారాష్ట్రనాయకులు ఆమోదించగలరన్న నమ్మకం తమకున్నదన్నారు.

మహా విదర్భ పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కన్నంవార్ ఇక తాము యావత్తు మహారాష్ట్ర అభివృద్ధికోసం పాటుపడగలమని ప్రకటించారు.

మధ్యప్రదేశ్ కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఎ. బి. బర్ధన్ బొంబాయినగరంలేని సంయుక్త మహారాష్ట్ర నిర్ణయాన్ని ఖండించారు.

సంయుక్త మహారాష్ట్ర వాదిఅయిన శ్రీ ఆర్. కె. పాటిల్ కేంద్ర నిర్ణయం పట్ల సంతృప్తి వెల్లడించారు. బొంబాయి నగరం కొస కొకనాటికి మహారాష్ట్రకు సంక్రమించ గలదని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

చెనుటా, నెస్తూరూ, కన్నీరూ ఓడ్చి అయినాసరే బొంబాయిని సంపాదించే వరకూ మహారాష్ట్రులు విశ్రమించరు అని పార్లమెంటు సభ్యుడు శ్రీ ఖరే ప్రకటించారు.

సంయుక్త మహారాష్ట్ర పరిషత్తు నాగపూర్ శాఖవారు జనవరి 21 న సమావేశమై బొంబాయిలేని సంయుక్త మహారాష్ట్రను గురించి చర్చలు జరుపుతారు.

ప్రత్యేక విదర్భవాదులైన మధ్యప్రదేశ్ వాణిజ్యమండలివారు విదర్భ ఏర్పడడంకంటే తమ ఆశాభావాన్ని వెలిబుచ్చారు. ఏమైనా కొత్త మహారాష్ట్రానికి నాగపూర్ రాజధాని కాగలదన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

నూతన మధ్యప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినందుకు హర్షం ప్రకటిస్తూ ముఖ్యమంత్రి శ్రీ రవిశంకర్ శుక్లా ఒక ప్రకటన చేశారు.

నాజీ హిట్లరుకి బ్రిటన్ మద్దతు

క్రుశ్చేవ్ పునరుద్ఘాటన

లండన్, జనవరి 16

రెండవ ప్రపంచయుద్ధంలో నాజీ హిట్లరును ఓడించి సోవియట్‌పైకి ఉసికొల్పినవారిలో బ్రిటిష్ పాలకవర్గం కూడా ఒకటని ఇటీవల ఆసియాపర్యటన సందర్భంలో ప్రసంగిస్తూ తానన్న మాటలలో తప్పేమీలేదని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నికిటాక్రుశ్చేవ్ 'డెయిలీ మిర్రర్' అనే ప్రముఖ బ్రిటిష్ పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూలో అన్నారు.

ఈ ప్రత్యేక ఇంటర్వ్యూచేసిన లేబరుపార్టీ సభ్యుడు హెర్బర్ట్ విల్సన్. ఆయన ఇటీవలనే సోవియటు నుండి తిరిగివచ్చి, ఈ విషయం రాశాడు.

"ఈ విమర్శను తాను ఒక్క బ్రిటనుమీదనే చేయడంలేదనీ, ఆ రోజుల్లో సర్వసాధారణంగా కొంతమంది పెద్దమనుషులు చేసిన పనిని గురించే చెప్పానని" క్రుశ్చేవ్ తనతో చెప్పినట్లు ఆయన రాశాడు.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభంకావడానికి ముందు రోజులను గురించి ప్రస్తావిస్తూ క్రుశ్చేవ్ ఇలా అన్నారని విల్సన్ తెలిపారు:

"ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం అంతాగాని, అందులో కొంతభాగం కాని, సోవియటుతో సహకరించేందుకు నిరాకరించింది. హిట్లరుకు లంచాలు ఇవ్వడానికి సిద్ధపడింది. సోవియట్‌పట్ల అతనికిగల దురాక్రమణ దుర్వాంఛలను ఉపయోగించుకోడానికి పూనుకుంది."

ఈ వసంతకాలంలో బ్రిటన్‌రాజల సందిగా బ్రిటిష్ ప్రధాని ఈడెన్ బుల్గానిన్, క్రుశ్చేవ్‌లకు లోగడ అందజేసిన ఆహ్వానంపై బ్రిటన్‌లో ఇప్పుడు సాగుతూన్న విమర్శనలను గురించి తెలుపగా క్రుశ్చేవ్ ఇలా అన్నారని విల్సన్ వాశారు:

"బ్రిటన్ వెళ్లాలనే మా కోరిక. మేమయి ఈ ప్రయాణాన్ని రద్దుచేసుకొనే ఉద్దేశం మాకులేదు. అదంతా బ్రిటిష్ ప్రభుత్వం మీదనే ఆధారపడి ఉంది.

"మంచి చెడ్డలు బాగా తెలిసిన అతిథులుమేము. మాకు ఆతిథ్యం ఇచ్చేవారికి ఇబ్బంది కలిగించే ఉద్దేశం మా కన్నడూ వుండదు."

అట్టావా, జనవరి 17

ప్రజా చైనాను దౌత్యసంబంధాల కేత్యా గుర్తించే సమస్యను గురించి తన ప్రభుత్వం శ్రద్ధతో ఆలోచిస్తున్నదని కెనడా విదేశాంగ మంత్రి లెస్టర్ పియర్సన్ నేడు ప్రకటించారు.

చైనాను గుర్తించడం గురించి కెనడా ప్రభుత్వం ఆలోచిస్తున్నదని అధికార ప్రకటన జరగడం ఇదే తొలిసారి.

నవ్వులు — పువ్వులు

పబ్లిసిటీ

గ్యారంటీ బహుమతులు

పజిలు కంట్రోలు బిల్లు ప్రకారము ప్రయిజు మొత్తం పరిమితి చేయబడి బహుమతులు గ్యారంటీ చేయబడినవి. పజిల్సులో పాల్గొనదలచినవారు, ఏదెంట్లుగా పనిచేయగోరువారు, యీ దిగువ యడ్రసుకు వ్రాయండి.

పజిల్సు ఎడిటరు :

నవ్వులు-పువ్వులు, రాజమండ్రి

కావలెను

అనుభవము గల ఎక్కౌంటెంటు వెంటనే కావలెను. జీతము, అనుభవం పేర్కొనుచు యోగ్యతా పత్రములతో వెంటనే వ్రాయవలెను.

పోస్టు బాక్సు నెం 370

విజయవాడ - 2

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కొట్రుగడ్డ రాజగోపాలరావు—ముద్రణ: స్వతంత్ర లిథో ప్రింటర్స్, లకింగ్ హాం పేట, విజయవాడ. సంపాదకవర్గం:— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] కంబంపాటి సత్యనారాయణ, కొట్రుగడ్డ రాజగోపాలరావు.